



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 30 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 23 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-

# అమరావతికి భారీ విరాళం

## ప్రపంచస్థాయి గ్రంథాలయానికి శోభా గ్రూప్ రూ.100 కోట్లు

## అమరావతి అభివృద్ధికి దుబాయ్ సంస్థ శోభా రియాల్టీ భారీ విరాళం

## ప్రపంచ స్థాయి లైబ్రరీ నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయింపు

## సీఎం చంద్రబాబు దుబాయ్ పర్యటనలో కీలక ప్రకటన

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భారీ ఊతం లభించింది. దుబాయ్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజం శోభా రియాల్టీ గ్రూప్, అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం (లైబ్రరీ) నిర్మాణానికి రూ.100 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు చేపట్టిన దుబాయ్ పర్యటనలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్‌లో శోభా రియాల్టీ గ్రూప్ ఛైర్మన్ రవి మేనన్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రవి మేనన్ మాట్లాడుతూ.. అమరావతిలో గ్లోబల్ ప్రమాణాలతో ఒక స్టేట్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ తరపున ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శోభా గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతిని ప్రపంచంలోని ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న తన ఆశయానికి ఈ విరాళం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించేందుకు ఏపీకి రావాలని రవి మేనన్‌ను ఆయన ఆహ్వానించారు. అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాష్ట్రాన్ని - మిగతా2లో

## పేదల కోసం ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు 2

పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు మాటామంతీ



## డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

- ఏఐ ద్వారా సృష్టించే కంటెంట్ మీద 'ఇది కృత్రిమం' అనే లేబుల్ తప్పనిసరి
- వీడియోకైతే తెర మీద 10శాతం మేర..
- ఆడియోకు తొలి 10 శాతం వ్యవధిలో..
- కృత్రిమ కంటెంట్ అప్‌లోడ్ చేసే వారి నుంచి అంగీకార పత్రం
- ఐటీ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ ముసాయిదా పత్రం

5



## భారత సైన్యంలో 'భైరవ్'

- తొలి బెటాలియన్ రెడీ!
- వచ్చే ఆరు నెలల్లో ఇటువంటి 25 బెటాలియన్లను సిద్ధం
- ఒక్కో భైరవ్ యూనిట్‌లో 250 మంది సుశిక్షిత జవాన్లు
- "ఇప్పటికే ఐదు భైరవ్ బెటాలియన్లు ఏర్పాటయ్యాయి
- రానున్న ఆరు నెలల్లో ఇటువంటివి 25 బెటాలియన్లను ఏర్పాటు కానున్నాయి

5

## రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు

- హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా కుంగిన కాంక్రీట్ ఇరుక్కుపోయిన హెలికాప్టర్ చక్రం
- సురక్షితంగా రాష్ట్రపతిని కిందికి దించిన భద్రతా సిబ్బంది
- కేరళలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఘటన

# ప్రసూతి వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



- ప్రసూతి వైద్య సేవలకు సంబంధించి ఏ దశలోనూ నిర్లక్ష్యం ఉండకూడదు
- పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర సిబ్బంది వ్యవహారంపై విచారించాలి
- జిల్లాలోని కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు తమ విశ్వాసాలను ప్రచారం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి
- అలాంటి వాటికి వైద్యశాలలను వేదిక చేయకూడదని వెల్లడి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ప్రసూతి వేళ అందించే వైద్య సేవలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని.. ఇందుకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పడా) డైరెక్టర్ చైత్రతో బుధవారం మధ్యాహ్నం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చేబ్రోలుకు చెందిన దొండపాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తర్వాత మృతిచెందిన ఘటనపై సమీక్షించారు. ప్రసూతి వైద్య సేవలకు సంబంధించి ఏ దశలోనూ నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర - మిగతా2లో



## ఏపీ మెరిట్ విద్యార్థులకు.. 50% సీట్లు కేటాయిస్తే బాధ ఎందుకు?

- ప్రభుత్వ సేవలు, పథకాలపై 75% మంది సంతృప్తి
- మంత్రి కొలుసు పార్థసారథి

2

# సంక్షేమ హాస్టల్ బాలికపై లైంగిక దాడి

- అవసరమైన వస్తువులు కొనిస్తానని మాయమాటలు
- స్నేహితుడితో కలిసి బైక్‌పై బాలికను తీసుకెళ్లిన యువకుడు
- హోటల్‌కు తీసుకెళ్లి అఘాయిత్యం
- తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఘటన
- రాజమహేంద్రవరంలో ఘటన
- హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్.. షోకాజ్ నోటీసు జారీ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాలిక రాజమహేంద్రవరంలోని సంక్షేమ హాస్టల్లో ఉంటూ టెన్త్ చదువుతోంది. ఆమెకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ - మిగతా2లో



## అమెజాన్‌లో రోబోలు

- ఉద్యోగులను తగ్గించుకునే ప్రణాళికలు?
- 6లక్షల మంది ఉద్యోగుల స్థానంలో నియామకం!
- 75 శాతం పనులను ఆటోమేషన్ చేసేందుకు రోబోటిక్స్ బృందం పనిచేస్తోంది

5

## ఏపీ మెరిట్ విద్యార్థులకు.. 50% సీట్లు కేటాయిస్తే బాధ ఎందుకు?

అమరావతి

కొత్త వైద్య కళాశాలల్లో 35% సీట్లే ఏపీ మెరిట్ విద్యార్థులకు దక్కేలా గత ప్రభుత్వ విధానం ఉందని, దానిస్థానంలో 50% సీట్లు వారికి దక్కేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కడుపుమంట ఎందుకని వైకాపా నేతలను మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. ఈ వైద్యకళాశాలల్లో పేద విద్యార్థులకు ఎక్కువ సీట్లు దక్కుతాయని, 70% పడకలు పేదల వైద్యానికే కేటాయిస్తారని చెప్పారు. బుధవారం సచివాలయంలో విలేకర్లతో మంత్రి మాట్లాడారు. ఒక్కో వైద్యకళాశాలకు ఏటా రూ.165 కోట్ల చొప్పున, అన్ని కళాశాలకు కలిపి రూ.3వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని, అందుకే పీపీపీ కింద అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో ఓపీ, మందులు, డయాగ్నస్టిక్ తదితర సేవలన్నీ ఉచితమేనని చెప్పారు. గత ప్రభుత్వంలో 2020లో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను ప్రైవేటుకు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. భోగాపురం విమానాశ్రయం, బందరు పోర్టు లాంటివి పీపీపీ కింద గతంలోనే ఇచ్చారు కదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలపై నెలకు 3కోట్ల మందికి ఫోన్లు చేసి అభిప్రాయాలు తీసుకుంటున్నామని, 75.1% మంది సంతృప్తికరంగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 741 సర్వీసులు అందుబాటులోకి తెచ్చినా, ఆశించిన స్థాయిలో వీటిని ప్రజలు ఎందుకు వినియోగించుకోవడం లేదన్నది పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. దీనికి యూజర్ ఫ్రెండ్లీ సాఫ్ట్‌వేర్ తీసుకురావాలని చంద్రబాబు సూచించారని చెప్పారు. రాష్ట్రంలో డ్రోన్ పాలసీ వచ్చాక డ్రోన్లను 2.10 లక్షల గంటలకుపైగా వినియోగించారని, ఇందులో 1.45 లక్షల గంటలు సమయాన్ని పురుగుమందుల పిచికారీకి వినియోగించినట్లు మంత్రి వెల్లడించారు.

**ఉప ముఖ్యమంత్రి నివేదిక అడగడంలో తప్పేముంది?**

భీమవరం డీఎస్పీ తీరుపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివేదిక కోరడంలో తప్పేముందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా తప్పు జరిగినా, మేలు జరిగినా ఉప ముఖ్యమంత్రి, మంత్రులు తెలుసుకోవడంలో తప్పులేదని పేర్కొన్నారు. తనకు వచ్చిన సమాచారం నిజమా కాదా అనేది తెలుసుకునేందుకే ఆయన డీజీపీని నివేదిక అడిగారని వివరించారు.

## పేదల కోసం ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు

అమరావతి

ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రాజెక్టునైనా పారిశ్రామికవేత్తలు తీసుకుని వస్తే వాటిని తానే స్వయంగా పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దుబాయ్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్న ఆయన పారిశ్రామికవేత్తల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడం కోసం ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు వివరించారు. 'రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రెండేళ్లలో పూర్తి చేస్తాం. ఇంటి ముంగిటే 40 నుంచి 50 రకాల పరీక్షలు నిర్వహిస్తాం. వచ్చే సమాచారం ఆధారంగా ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలో సూచిస్తాం. దీంతోపాటు యోగాను ప్రమోట్ చేస్తున్నాం. డిసీజ్ ప్రొఫైల్‌ను సిద్ధం చేస్తాం. వ్యాధుల్ని తగ్గించడంపై చర్యలు తీసుకుంటున్నాం. నా వేలికి ఓ రింగ్ ఉంది. నేను ఎంతసేపు నిద్రపోయానో.. ఎంతసేపు నిద్రపోవాలో తెలియపరుస్తుంది. నిద్ర చాలకపోతే మరింతసేపు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తుంది. నా హార్ట్ బీట్.. వంటివి అన్నీ చెబుతుంది' అని వివరించారు. 'చికిత్సలో రోగ నిర్ధారణ చాలా ముఖ్యమైనది. ప్రస్తుతం కొన్నిచోట్ల రోగం ఒకటైతే.. చికిత్స ఒకటి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో దీనికి చెక్ పెడతాం. ప్రతి కుటుంబం ఏఐ ద్వారా లబ్ధి పొందనుంది' అని చంద్రబాబు తెలిపారు.

## ప్రసూతి వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

-మొదటిపేజీ తరువాయి

సిబ్బంది వ్యవహారంపై విచారించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. శ్రీదుర్గ మరణంపై నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలోని కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు తమ విశ్వాసాలను ప్రచారం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, అలాంటి వాటికి వైద్యశాలలను వేదిక చేయకూడదని వెల్లడించారు. ఈ సమావేశంలో శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

## ఈ నెల 23 నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన

విజయవాడ



జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభారీ అధికారి %డ% నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 23వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు ముండ్లపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 24వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం, కేతనకొండ, కొండపల్లి, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే), ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్‌బాబు మమేకమవుతారు.

## ఆర్థిక ప్రయాణాన్ని రూపొందించే సమయం దీపావళి ముహూర్తం ట్రేడింగ్



విజయవాడ

ముహురత్ ట్రేడింగ్ అనేది విశ్వాసం, జ్ఞానం, క్రమశిక్షణతో మన ఆర్థిక ప్రయాణాన్ని రూపొందించే సమయం. పెట్టుబడి అంటే కేవలం సంపదను సృష్టించడం మాత్రమే కాదు.. భారతదేశ అద్భుతమైన ఆర్థిక వృద్ధి గాథలో భాగం కావడం కూడా.. అని ఎన్ఎస్ఈ ఎండీ అండ్ సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ ఎక్స్ లో పేర్కొన్నారు. "ఎక్కువ మంది ప్రజలు మూలధన మార్కెట్లలో ప్రవేశిస్తున్న సమయంలో విశ్వాసాన్ని పెంపొందించడానికి, దీర్ఘకాలిక శ్రేయస్సును సాధించడానికి పెట్టుబడిదారుల అవగాహన, సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో ప్రతి పెట్టుబడిదారుడు విశ్వాసం, బాధ్యతతో వృద్ధి చెందగల పారదర్శకమైన, సమ్మిళిత వాతావరణాన్ని పెంపొందించడం పట్ల మేము నిబద్ధతగా ఉన్నాము. కొత్త ప్రారంభాల స్ఫూర్తితో, జ్ఞానం మన ఎంపికలకు మార్గనిర్దేశం చేస్తుంది, విజయం మన సొంతమవుతుంది. ఈ పండుగ ప్రతి ఒక్కరికీ సంపద, ఆరోగ్యం, ఆనందం, శాంతిని తీసుకురావాలని కోరుకుంటూ, అందరికీ దీపావళి శుభాకాంక్షలు" అని ఆశిష్ కుమార్ చౌహాన్ ట్వీట్ చేశారు.

## సంక్షేమ హాస్టల్ బాలికపై లైంగిక దాడి

-మొదటిపేజీ తరువాయి

కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన పాము అజయ్(22) పరిచయమయ్యాడు. ఆ బాలికను చెల్లి అని సంబోధిస్తూ ఏదైనా అవసరమైతే తనకు చెప్పమనేవాడు. ఈ క్రమంలో సోమవారం సా.5 గంటల సమయంలో బాలిక సబ్బులు, ఇతర వస్తువులు తెచ్చుకుంటానని హాస్టల్ వార్డెన్ ఉమాదేవికి చెప్పి బయటకెళ్లింది. అయితే, అదేరోజు రాత్రి 7 గంటలకు బాలిక తల్లి హాస్టల్‌కు వచ్చింది. అదే సమయంలో బాలిక బయటి నుంచి రావడంతో ఎక్కడికి వెళ్లావని తల్లి నిలదీసింది. బాలిక జరిగినదంతా తల్లికి చెప్పింది. తనను అజయ్, రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన అతడి స్నేహితుడు కాగితపల్లి సత్యస్వామి (21) కలిసి బైక్ మీద బయటకు తీసుకెళ్లారని, సత్యస్వామి తమను రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ వద్ద దింపి వెళ్లిపోయాడని తెలిపింది. ఆ తర్వాత అజయ్ హోటల్ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడని చెప్పింది. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే లాడ్జి వద్దకు వెళ్లి ఆరా తీయగా లాడ్జి నిర్వాహకులు జరిగిందంతా చెప్పారు. తాము వేరే ఊరు నుంచి పరీక్షలు రాయడానికి వచ్చామని, మర్నాడు వెళ్లిపోతామని యువకుడు చెప్పినట్లు వివరించారు. పోలీసులు అజయ్, సత్యస్వామిపై మంగళవారం కేసులు నమోదు చేశారు. అలాగే, మైనర్లకు గది ఇచ్చిన లాడ్జి నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. నిందితులిద్దరినీ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపర్చనున్నారు. మరోవైపు.. కలెక్టర్ కీర్తి చేకూరి హాస్టల్ వార్డెన్ ఉమాదేవికి షోకాజ్ నోటీసు జారీచేసి సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో సమగ్ర విచారణ చేపడతామని వెల్లడించారు.

## అమరావతికి భారీ విరాళం

-మొదటిపేజీ తరువాయి




తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలోని గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, పోర్టు ఆధారిత అభివృద్ధి జోన్లలో టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్లు, ఐటీ పార్కులు, మాల్స్, కన్వెన్షన్ సెంటర్లు, ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టవచ్చని సూచించారు. శోభా గ్రూప్ తమ ఆదాయంలో 50 శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించడాన్ని చంద్రబాబు ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం పీ4 నమూనాతో "జీరో పావర్టీ మిషన్" అమలు చేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ దుబాయ్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాలతో పాటు భారతదేశంలోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని రవి మేనన్ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరుకావాలని శోభా రియాల్టీ యాజమాన్యాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

# పటేల్ స్ఫూర్తితో ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలి

- ఈనెల 31 నుంచి నవంబర్ 25 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు
- కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్




విజయవాడ

జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్–150లో భాగంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రచార యాత్ర ప్రారంభించటం గర్వంగా ఉందని కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్ తెలిపారు. నగరంలోని స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాసు మాట్లాడుతూ భారత చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన ఈ నెల 31 నుంచి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచారయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాలు, జిల్లాలలో సర్దార్ 150 యూనిటీ మార్చ్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా (భారత ఉక్కు మనిషి)గా భారతీయ ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆయన చేసిన త్యాగాలను మరువలేమన్నారు. ఈనెల ఆరవ తేదీన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డా. మన్సుఖ్ మాండవియా దేశవ్యాప్తంగా సర్దార్ 150 యంగ్ లీడర్స్ ప్రోగ్రాం క్విజ్ లలో భాగంగా డిజిటల్ దశ ను ప్రారంభించారన్నారు. దేశవ్యాప్తంగా యువత సోషల్ మీడియా రీల్ కాంపిటేషన్లు, వ్యాస రచన పోటీలు, క్విజ్ పోటీలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎంతో మంది ప్రముఖ నేతలున్నా మనకు నేతాజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి నాయకులే మనకు గుర్తుకువస్తారన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఉపసంచాలకులు ఎస్వీడీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిధ్యాలను ప్రతిబింబించే విధంగా పట్టణాలు, గ్రామాలలో ఈ నెల 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యోగా, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచారయాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన నిర్వహిస్తామని, స్వచ్ఛత డ్రైవ్ లు, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ యువత చురుకుగా పాల్గొంటారన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పార్లమెంటు సభ్యులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, వృద్ధులు, రిటైర్డ్ అధికారులు, క్రీడాకారులు వెటరన్స్, యువత ఈ ప్రచార యాత్రలో పెద్దఎత్తున పాల్గొంటారన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ప్రతి జిల్లాలో 8 కి.మీ నుంచి 10 కిలోమీటర్లు వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. మై భారత్ పోర్టల్ లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సర్దార్ 150 ఐక్యతా మార్చ్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మై భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో యు. శ్రీనివాసరావు, తదితరలు పాల్గొన్నారు.

# పత్తి రైతు చిత్తు

అమరావతి

టీడీపీ కూటమి ప్రభుత్వం చేతిలో పత్తి రైతు మరోసారి చిత్తయిపోతున్నాడు. మార్కెట్ మాయాజాలంతో గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ధరలు పడిపోతున్నా సర్కారు తనకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. దిగుమతి సుంకం మినహాయింపు ప్రభావంతో ఈ ఏడాది పత్తి కొనేవారు లేకపోవడంతో ఈ అవకాశాన్ని దళారులు తమకు అనుకూలంగా మలుచుకుని రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మరోవైపు.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పిలిచిన టెండర్లకు జిన్నింగ్ మిల్లు యజమానుల నుంచి స్పందన కరువైంది. ఫలితంగా.. ఎప్పుడు, ఎన్ని ఏర్పాటుచేస్తారో కూడా ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది.

**ముందుకు రాని జిన్నింగ్ మిల్లులు..**

రాష్ట్రంలో పత్తి సాధారణ విస్తీర్ణం 14.91 లక్షల ఎకరాలు. ఈ ఏడాది అతికష్టం మీద 10.75 లక్షల ఎకరాల్లో సాగవగా, 8 లక్షల టన్నుల దిగుబడులొస్తాయని అంచనా వేశారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు మిల్లులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో 122 జిన్నింగ్ మిల్లులు ఉండగా, గతేడాది కేవలం 45 మిల్లులు మాత్రమే సీసీఐతో ఎంపానల్ అయ్యాయి. కానీ, ఈ ఏడాది పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు గత నెల ఒకటిన సీసీఐ టెండర్లు పిలిచినా ఒక్క జిన్నింగ్ మిల్లు కూడా ముందుకు రాలేదు. దీంతో టెండర్ల ప్రక్రియ ఇప్పటివరకు కొలిక్కిరాలేదు. మరోవైపు.. అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. మిగిలిన దిగుబడినైనా మద్దతు ధరకు అమ్ముకుందామంటే వ్యాపారులు రైతుల్ని నిలువునా దోచేస్తున్నారు. 2025%–%26 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాకు మధ్యస్థ రకం పత్తికి రూ.7,710, పొడవు రకానికి రూ.8,110గా కేంద్రం ప్రకటించింది.

**మూడొంతులు లాట్లకు దక్కే ధర రూ.3,960లే..**

కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్ పరిధిలో ఏటా రూ.1,400 కోట్ల పత్తి వ్యాపారం జరుగుతుంది. ఈ యార్డుకు ప్రస్తుతం 10%–%12 వేల క్వింటాళ్ల పత్తి నిల్వలు వస్తున్నా.. రైతులకు మాత్రం మద్దతు ధర దక్కడంలేదు. ఏటా అక్టోబరు 1 నుంచి ప్రారంభం కావాల్సిన కొనుగోలు కేంద్రాలు ఈసారి ఎప్పుడు తెరుస్తారో తెలీక రైతులు దళారులకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన పత్తికి సైతం క్వింటా ధర సగటున రూ.5 వేల నుంచి రూ.7వేలే పలుకుతోంది. యార్డులో శనివారం గరిష్ఠంగా క్వింటా పత్తి రూ.7,499 పలికినప్పటికీ ఈ ధర దక్కింది కేవలం 5%–%10 శాతం లాట్లకు మాత్రమే.

మధ్యస్థ రకం క్వింటాకు రూ.7,299 దక్కింది. కానీ, ఈ ధర 15 శాతం లాట్లకు మించి లభించలేదు. ఇక దాదాపు 75 శాతం లాట్లకు క్వింటాకు రూ.3,960 చొప్పున మాత్రమే లభించింది. తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో అడ్డగోలుగా కోత పెడుతున్నారు. పెద్ద వాహనానికి 20%–%30 కిలోలు, చిన్న వాహనానికి 10%–%15 కిలోలు చొప్పున తక్కువ తూకాలు చూపుతున్నారు. పైగా.. క్వింటాకు 6%–%10 కిలోల తరుగు తీసేస్తున్నారు. కనిష్ట, మధ్యస్థ ధరలే కాదు.. గరిష్ట ధర కూడా కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు దరిదాపులో లేకపోవడంతో రైతులు ఏస్థాయిలో నష్టపోతున్నారో అర్థమవుతుంది.

**గతంలో సీజన్‌కు ముందుగానే..**

నిజానికి.. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పంట కోతకొచ్చేందుకు కనీసం 45 రోజుల ముందుగానే కేంద్రాల ఏర్పాటుపై స్వయంగా సీఎంతో పాటు వ్యవసాయ శాఖమంత్రి సమీక్ష చేసేవారు. ఏటా సెప్టెంబరు రెండో వారం నుంచే ఈ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేవారు. మూడో వారంలో ఆర్బీకేల ద్వారా రైతుల వివరాలు నమోదుచేసి నాలుగో వారం నుంచి కొనుగోలుకు శ్రీకారం చుట్టేవారు. పైగా.. ఏటా గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకునేవారు. ఫలితంగా నాడు క్వింటా రూ.9,500 నుంచి రూ.10,600 వరకు ధర లభించింది. కానీ, కూటమి ప్రభుత్వంలో గతేడాది సగటున క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,200 మాత్రమే లభించింది. ఈ ఏడాది కూడా పంట పూర్తిగా మార్కెట్‌కు వచ్చే సమయానికి క్వింటాకు గరిష్టంగా రూ.5 వేలకు మించి లభించదని అంచనా వేస్తున్నారు.

## అనపర్తిలో జన్మభూమి రైలు హాల్ట్..

### ఫలించిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం -లింగంపల్లి జన్మభూమి ఎక్స్ ప్రెస్ (రైలు నెం 12805/12806) రైలుకి అనపర్తి స్టేషన్లో హాల్ట్ ఇవ్వాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చేసిన కృషి ఫలించింది. ఈమేరకు రైల్వే బోర్డు ఆమోదం లభించింది. అతి త్వరలోనే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని రైల్వే అధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.గతం నుంచి ఈ డిమాండ్ ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. అయితే అనపర్తి,పరిసర ప్రాంత ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తిని పరిగణన లోకి తీసుకుని అనపర్తిలో జన్మభూమి ఎక్స్ ప్రెస్ నిలుపుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ పురందేశ్వరి రైల్వే అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ అంశంపై ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన,జూలై 25వ తేదీన రైల్వే మంత్రికి లేఖలు కూడా రాసారు. దీంతో అనపర్తిలో జన్మభూమి ఎక్స్ ప్రెస్ హాల్ట్ కి రైల్వే బోర్డునుంచి ఆమోదం తెల్పింది. కాగా మచిలీపట్టణం - విశాఖ పట్నం ఎక్స్ ప్రెస్ (నెం 17219/17220), విశాఖపట్నం - కడప ఎక్స్ ప్రెస్ (18521/18522) తిరుమల ఎక్స్ ప్రెస్ రైళ్లు కొవ్వూరు స్టేషన్ లో నిలుపుదల చేయాలని ఎంపీ పురందేశ్వరి చేసిన ప్రయత్నానికి రైల్వే బోర్డు ఆమోదం తెలుపుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెల్సిందే.ఈ విషయంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి ఫలించించింది అని ఆయా వర్గాల ప్రజలు అభినందించారు.

## అండర్ - 14 అండర్ - 17 వాలీబాల్ టీం ఎంపిక

### విద్యాశాఖాధికారిణి సుజాత



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలం వివిధ గ్రామాల్లోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులను అండర్ 14 అండర్ 17 వాలీబాల్ టీమ్ కి ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారిణి సుజాత తెలిపారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆటల పోటీలకు ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను గుర్తించి, మండల స్థాయి టీం ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనిలో భాగంగా మండలంలోని దోసకాయలపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులతో ఆటల పోటీలు నిర్వహించమని పోటీలలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఎంపిక చేసి,మండల స్థాయి వాలీబాల్ టీం ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాయామ ఉపాధ్యాయుల కోఆర్డినేటర్ జగదీష్, బూరుగుపూడి వ్యాయామ ఉపాధ్యాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ ఆదాయంతో, విదేశీయుల జేబులు నింపొద్దు..

### ప్రతి ఇంటా స్వదేశీ - ఇంటింటా స్వదేశీ నినాదంతో ప్రచారం - ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశ సంపద విదేశాలకు పోకుండా మన దేశమే అభివృద్ధి చెందుతుందనే సంకల్పంతో చేపట్టిన "ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ" అనే నినాదాన్ని సమాజంలో తీసుకెళ్ళాలని మాజీ శాసనసభ్యులు వేమా అయ్యాజీ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట నియోజకవర్గం, రాయవరం మండలం లొల్ల గ్రామంలో మండల శాఖ అధ్యక్షులు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేమా అయ్యాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఇంటా స్వదేశీ ఇంటింటా స్వదేశీ అనే నినాదంతో, ప్రతి భారతీయుడు స్వదేశీ వస్తువుల్ని మాత్రమే కొనాలని ఇలా చేయడం ద్వారా మన దేశ సంపద విదేశాలకు పోకుండా మన దేశమే అభివృద్ధి చెందుతుందని సూచించారు. అనంతరం కార్యకర్తలందరితో స్వదేశీ వస్తువులను వాడతామని, దేశానికి లాభం చేకూరే పనులను నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కో కన్వీనర్ కొత్తపల్లి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ చీకురుమిల్లి శ్రీనివాసరావు, ప్రధాన వక్త జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, బిజెపి నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, బండారు సూరిబాబు, నరాల రాంబాబు, చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నామాల శ్రీనివాస్, కంకటాల మురళీకృష్ణ, కరటూరి శ్రీనివాస్, అంగర జనార్ధన స్వామి, అబ్బిరెడ్డి శాంతారావు, వెత్సా ప్రసాదు, కోటిపల్లి కృష్ణమాచార్యులు, సూరంపూడి సత్యనారాయణ, శకుంతల, చాట్రాతి సరస్వతి, పెదపాటి వసంత, తదితరులు పాల్గొన్నారు.

## గేమింగ్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు : ఎస్ఐ జి.నరేష్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ ఆలమూరు గ్రామం పరిసర ప్రాంతంలో 9(1) ఏపీ జీ యాక్ట్ ప్రకారం గేమింగ్ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు పాల్పడిన వ్యక్తుల వద్ద నుండి స్థానిక ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో రూ.3050 నగదు స్వాధీనం చేసుకుని చర్యల చేపట్టారు. గేమింగ్ చట్టం కింద అక్రమంగా పేకాట ఆడుతున్న సుమారు 10 మందిని గుర్తించి, స్థానిక ఎస్.ఐ జి నరేష్ సిబ్బంది ఆధ్వర్యంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు తీసుకున్న ప్రయత్నంలో భాగంగా అక్రమ గేమింగ్ కొనసాగితే, అదుపులోకి తీసుకున్న నగదుతో పాటు, చర్యలు మరింత కఠినంగా ఉంటాయని పోలీసులు హితవు తెలియజేశారు.

## విద్యార్థినిపై యువకుడు అత్యాచారం..

### రాజమండ్రి టూటౌన్ పరిధిలో దారుణం.. - బాధితురాలి ఫిర్యాదుతో ఫోక్సో కేసు నమోదు..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్ :** మాయమాటలతో బయటకు తీసుకువెళ్లి పదో తరగతి హాస్టల్ విద్యార్థినిపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటన రాజమహేంద్రవరం నగరంలో కలకలం రేపింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు.. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైంది. నిందితుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెంకు చెందిన అజయ్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రిలోని గణేష్‌చౌక్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహం హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినిని సోమవారం సాయంత్రం అన్నయ్య వచ్చాడని, సబ్బులు తెచ్చుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి విద్యార్థిని బయటకు వెళ్ళింది. అక్కడ నుంచి గోదావరి గట్టుకు వెళ్దామని మాయ మాటలు చెప్పి, ఆమెకు పరిచయం ఉన్న అజయ్ అనే యువకుడు బైక్‌పై తీసుకు వెళ్లాడు. అజయ్ వెంట బైక్‌పై మరో యువకుడు కూడా వెళ్ళాడు. ఆ బాలిక పట్ల అసభ్య ప్రవర్తిస్తూ, మాయ మాటలతో అజయ్ రైల్వే స్టేషన్ రోడ్‌లో ఓ లాడ్జికు తీసుకువెళ్లాడు. రూమ్‌లో ఆ బాలికపై అజయ్ అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆ అమ్మాయిని బైక్‌పై తీసుకువచ్చి, అజయ్, అతని మిత్రుడూ.. దేవీచౌక్‌లో దింపివేశాడు. అక్కడ నుండి విద్యార్థిని హాస్టల్‌కి వెళ్లిపోయింది. ఈ అమ్మాయి కంగారు పడటం, మెడ, పెదాల పైన గాట్లు ఉండేసరికి అనుమానం వచ్చి అమ్మాయిని వార్డెన్ ప్రశ్నించడంతో.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జరిగిన విషయం చెప్పడంతో.. కంగారుపడి వెంటనే వారి తల్లి దండ్రులకు హాస్టల్ వార్డెన్ సమాచారం ఇచ్చారు. ముందుగా ఈ బాలికని ఆసుపత్రికి తీసుకువెళ్లి, ఆ తర్వాత వార్డెన్‌తో సహా.. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి బంధువులు ఫిర్యాదు చేశారు. అనుమానిత వ్యక్తి సెల్ నెంబర్ ఆధారంగా రావులపాలెంకు చెందిన అజయ్‌గా పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిపై ఫోక్సో, అత్యాచారం సెక్షన్లు కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ శివ గణేష్ తెలిపారు.

## నరసన్న కార్తీక మహోత్సవాలు సమిష్టిగా నిర్వహిద్దాం : బత్తుల

### నరసన్న తెప్పోత్సవంపై సమీక్ష - బత్తుల రూ.3 లక్షలు విరాళం





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కార్తీక మాస మహోత్సవాలు సమిష్టిగా నిర్వహించాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం అన్నవరం దేవస్థానం అధికారులు, ఎన్డీఏ నాయకుల ఆధ్వర్యంలో నరసన్న కార్తీక మాస మహోత్సవం సందర్భంగా నరసన్న తెప్పోత్సవం, అన్న సమారాధన, మెట్లకు దీపోత్సవం వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు బత్తుల మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు, ఎన్డీఏ నాయకులు, భక్తుల సహాయ సహకారాలతో ఈ ఏడాది కార్తీక మాస మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించాలన్నారు. కార్తీకమాసం సందర్భంగా నరసన్నను దర్శించడానికి విచ్చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అన్న సమారాధన నిర్వహించాలన్నారు. అన్న సమారాధనకు తాను మూడు లక్షలు రూపాయలు ఇస్తానన్నారు. నవంబర్ 2న కార్తీక క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా నరసన్న తెప్పోత్సవానికి అందరి అధికారులు సమన్వయంతో పనిచేసి, వైభవంగా నిర్వహించాలన్నారు. ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో నరసన్న సేవా కమిటీ ఏర్పాటు చేసి, అధ్యక్షులుగా అడ్డాల శివ చక్రవర్తి వ్యవహరిస్తారన్నారు. అనంతరం స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి చరిత్ర పుస్తకాన్ని శాసనసభ్యులు బత్తుల, ఆలయ ధర్మకర్త రంగరాజ బట్టర్, చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ గణేష్, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, తాసిల్దార్ సుస్వాగతం, ఎన్డీఏ నాయకులు అడపా వీరబాబు, రొంగల శ్రీనివాస్, కటకం చలం, మార్ని రాము, అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, ఎర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, అన్నవరం దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం, సేవా గుణం గొప్పవరం..

### ❑ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు ఆదర్శం ❑ సేవే సత్యం - సేవే నిత్యం పురస్కారాలు ప్రధానం చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేటి సమాజంలో దాతృత్వం, సేవా గుణం కలిగి ఉండడం గొప్ప వరమని,ఆ దిశగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సామాజిక సేవలో ముందుకు సాగడం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిర్వహించిన సేవే సత్యం. సేవే నిత్యం పురస్కార్ -2025 కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సమాజసేవే పరమావధిగా భావిస్తూ ఎంతోమంది నిరుద్యోగులకు, వితంతువులకు, మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోసం జాబ్ మేళాలో నిర్వహించి తమ వంతు పాత్రను పోషిస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు అందరికీ ఆదర్శం కావాలన్నారు.సమాజం నుంచి మనం ఏమి పొందామని కాకుండా సమాజానికి మనం తిరిగి ఏమి ఇచ్చాం అనే ఆలోచన గొప్పదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆశయం పే బ్యాక్ టు ద సొసైటీ నినాదం అన్నారు. సమాజంలో నిరంతరం శ్రమిస్తూ తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలని ఈ అవార్డులు ప్రధానం చేయడం ఆనందకరమన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సాటివారి కష్టాల్లో సహాయ పడటం లో ఉన్న సంతృప్తి మరి ఎక్కడా దొరకదు అన్నారు. రామచంద్రపురం నియోజవర్గం ప్రజలు రుణం తీర్చుకునే అవకాశం సామాజిక సేవల ద్వారా కలిగిందన్నారు. ఇకనుంచి ప్రతి ఏటా తన పుట్టినరోజున అక్టోబర్ 20న ఈ అవార్డుల ప్రధానోత్సవం కొనసాగిస్తామన్నారు. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు.. ఎప్పుడూ సాయం చేయి.. ఎవరిని బాధించకు అనే మానవత్వపు సందేశాలతో ముందుకుసాగుతామని వెల్లడించారు. జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ రక్తసంబంధీకులు కూడా పట్టించుకోని ఈ రోజుల్లో సేవే కర్తవ్యం గా సొంత నిధులను వెచ్చించి ఎంతోమందికి దారి చూపుతున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందరికి ఆదర్శం అన్నారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్ మాట్లాడుతూ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తాము ఎప్పుడు అండగా ఉండి వెన్ను దన్నుగా నిలుస్తామన్నారు.సత్యం వాసంశెట్టి ట్రస్టు సేవలు నియోజవర్గ పేదలు పాలిట వరమన్నారు. అనంతరం సమాజానికి పలు రూపాల్లో సేవలు అందిస్తున్న ఐదుగురు ప్రతిభావంతులకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా అవార్డుల ప్రధానోత్సవం చేసారు.

**అవార్డు గ్రహీతలు వీరే**

రాజా కాకర్లపూడి నరసరాజు మాజీ మున్సిపల్ చైర్మన్, వెల్ల కామెర్ల మందును ప్రజలకు అందిస్తూ సేవలు అందిస్తున్న గుండుభోగుల లక్ష్మణరావు,నిరుపేదలకు తమ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్న పోలిశెట్టి చంద్రశేఖర్ (జనసేన ఇన్చార్జి)కొప్పిశెట్టి శ్రీకృష్ణ సాయి (రేవతి సైన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు), అంగవైకల్యాన్ని అధిగమించి మెగా డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎన్నికైన కసిరెడ్డి సత్తిబాబును,ఆయనకు అన్నీ తానై నడిపించిన సోదరుడు సురేష్ ను అవార్డులతో మంత్రి సుభాష్ జ్ఞాపికలు, దుసశాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గంలోని కూటమి పార్టీ నాయకులు పాల్గొని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు సభలో కొనియాడారు.

# ఎడిటర్ వాయిస్

## బీసీ రిజర్వేషన్లపై రాజకీయ సంకల్పం ఏదీ?

కొందరు మనసులో అనుకున్నదీ, మరికొందరు బయటికి అన్నదే జరిగింది. ఇరుపక్షాల వాదనలూ విన్న తెలంగాణ ఉన్నత న్యాయస్థానం స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం స్థానాలు కేటాయిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు అమలుపై తాత్కాలిక నిషేధం విధించి, ఆ వ్యాజ్యాన్ని ఆరు వారాల తర్వాత వింటామంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ కూడా తాత్కాలికంగా నిలిపి వేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా కొట్టివేసింది. ఐతే, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రాతపూర్వక మధ్యంతర ఉత్తర్వులు రాకుండానే, రాజకీయ పక్షాల మధ్య అమీతుమీ మొదలైంది. ప్రస్తుతానికి సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది, తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం 25% కేటాయింపులతోటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, కావాలనుకుంటే న్యాయస్థానాలలో పోరాటం కొనసాగించవచ్చు. అధికార పక్షం, మంత్రులు తమ ప్రకటనలలో ప్రధాన ప్రతిపక్షాలైన భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి 42 శాతం రిజర్వేషన్ రాకుండా అడ్డుకున్నాయన్నారు. ఆరు గ్యారంటీలు మాదిరిగానే కాంగ్రెస్ 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై డ్రామాలాడుతున్నదని, కాంగ్రెస్, బీజేపీ కలిసి బీసీలను మోసం చేస్తున్నారని, బీఆర్ఎస్ విమర్శ. జీవో సంఖ్య- 9 అమలు ఉన్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపి వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ అభియోగం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతోనే రిజర్వేషన్లు అమలు కావడం లేదని సీపీఎం ఆరోపణ. ప్రస్తుతానికి సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు)లో సుప్రీంకోర్టు అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తేల్చి చెప్పింది. దీంతో అప్పటి వరకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోన్న తమిళనాడు ప్రభుత్వానికి చుక్కెదురైంది. మేల్కొన్న ప్రభుత్వం రాష్ట్రంలోని విద్య, ఉద్యోగా ల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు యథావిధిగా అమలు చేసేందుకు 1994లో ప్రత్యేక చట్టం చేసింది. అదే సంవత్సరం కేంద్రం 76వ రాజ్యాంగ సవరణ చేసి, ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్పించడంలో సఫలమైంది. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాల సమీక్ష కుదరదు. వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం స్థానాలు కేటాయించడానికి ఉద్దేశించిన బిల్లు శాసనసభలోని అన్ని రాజకీయ పక్షాలు ఆమోదించాయి. తగువంతా ఇందుకు ఖ్యాతి ఎవరి ఖాతాలో వేసుకోవాలన్నదే. ప్రజా క్షేమమే పరమావధి అనుకున్న సందర్భంలో అట్లాంటి అహంభావపూరిత ఆలోచన సరికాదు. మనం రెండు ముఖ్యమైన విషయాలు మరచిపోరాదు. ఉన్నత న్యా యస్థానం మధ్యంతర ఉత్తర్వుల ద్వారా వెనకబడిన తరగతులకు స్థానిక సంస్థలలో కేటాయింపులు నిలుపుదల చేయలేదు. ఎన్నికల నిర్వహణలో జోక్యం కలగజేసుకోలేదు. కేవలం ఆ కేటాయింపుల శాతాన్ని 25కు కుదించింది. కావాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వం పాత కేటాయింపుల ప్రకారం ఎన్నికలకు వెళ్లవచ్చని సూచించింది. సర్వో న్నత న్యాయస్థానం కూడా ఇదే అభిప్రాయం వ్యక్తపరచింది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ప్రధాన రాజకీయ పక్షాలన్నీ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల వారికి 42 శాతం కేటాయింపులకి అనుకూలమే కాబట్టి, తాము అభ్యర్థులను ప్రకటించే సమయంలోనే వెనుకబడిన తరగతులకు 42% కేటాయించవచ్చు. అలాచేయడం వలన న్యాయస్థానం విధించిన గడువు లోగా ఎన్నికల నిర్వహణ సుగమవుతుంది. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల వివిధ పథకాలకు కేంద్రం నుంచి రావా ల్సిన నిధులకు కోతపడే ప్రమాదం తప్పుతుంది. ఇప్పటికే, ఈ కారణంగా ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. అంతేకాదు. 'తొందరపడి ఒక కోయిల ముందే కూసినట్టు', స్థానిక సంస్థల ఎన్నికల విషయం ఉన్నత న్యాయస్థానం ముందుండగానే, నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# బహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయపతి కామేశ్వరి

న్యాయపతి కామేశ్వరి, రాఘవరావుల గురించి ఈ తరం వారికి ఎక్కువగా తెలియక పోవచ్చు. రేడియో ప్రధాన ప్రసార సాధనంగా, తెలుగు ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకు పోయిన రోజులలో రేడియో 'అక్కయ్య, అన్నయ్య'లుగా ప్రసిద్ధులైన వారిద్దరు, ఆంధ్ర బాలానంద సంఘం పేరుతో 1939-40 నుండి 1955-56 ప్రాంతం వరకు మద్రాసు, ఆ తరువాత హైదరాబాదు నుండి తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ప్రత్యేకంగా వాళ్లిద్దరు కలిసి చేసిన రేడియో కార్యక్రమాలు కొన్ని అజామరాలుగా నిలిచి పోయాయి. వారు రాసి కొంత వరకు బాణీలు కట్టిన కొన్ని పాటలు కంప్యూటర్.ఎం.వి సంస్థ ద్వారా రికార్డులుగా వెలువడ్డాయి. రేడియో అక్కయ్యగా పేరుపొందిన న్యాయపతి కామేశ్వరి (1908 - 1980) విజయ నగరంలోని 1908లో పండితుల, విద్వాంసుల కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖపట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు. ఆ కాలంలో బి.ఎ. ఉత్తీర్ణులైన మొట్టమొదటి మహిళ ఆమే. తరువాత కొంతకాలం నూజివీడు ఎస్టేటులో కపిలేశ్వరపురం జమిందారిణి జగదీశ్వరమ్మలు ఇంగ్లీషు నేర్పారు. 1934లో న్యాయపతి రాఘవరావును వివాహం చేసుకున్నారు. తరువాత 1937లో మద్రాసులోని వెల్లింగ్టన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీ లో ఉపాధ్యాయ శిక్షణ (ఎల్.టి.) పూర్తిచేశారు. ఇద్దరి అభిప్రాయాలు కలియడంతో భర్తకుతోడుగా, చెన్నై రేడియో కార్యక్రమాలలోను, బాల పత్రిక నిర్వహణలోను ఆమె చురుగ్గా పాల్గొన్నారు. చెన్నై ఆకాశవాణి కేంద్రం వారు ఆటవిడుపు పేరుతో పిల్లల కార్యక్రమ నిర్వహణ చేపట్టి, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యలను న్యాయపతి దంపతులకు అప్పగించారు. ఆ విధంగా ఆమె రేడియో అక్కయ్యగా స్థిర పడి పోయారు. రాఘవరావు ఈమెతో పాటుగా రేడియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూం డటంతో, ఆయనకు రేడియో అన్నయ్యగా పేరొచ్చింది. తరువాత ఈ కార్యక్రమం బాలానందంగా రూపాంతరం చెంది ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా పలు సంవత్సరాలు వారిద్దరిచే నిర్వహించడం జరిగింది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యాయపతి కామేశ్వరి స్త్రీల కార్యక్రమాలకు ప్రయోక్తగా పని చేసేవారు. ఆకాశవాణి హైదరాబాద్ లో పనిచేస్తున్న కామేశ్వరి రేడియోకు అటు పత్రికలకు, రంగస్థలానికి అనేక నాటికలు, కథలు, గేయాలు రాసేవారు. చాలా మంది బాలలను నటులగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. అనేక పల్లె ప్రాంతాలలో రేడియో మహిళా మండలలు ఏర్పాటు కావడానికి కృషి చేశారు. పేద మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడిన స్త్రీ న్యాయపతి కామేశ్వరి. ఆనాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసలను కూడా ఈమె అందుకున్నారు. బొమ్మల కొలువులు ఉత్సవాలు విహార యాత్రలు నిర్వహించే వారు. సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండే ఆమె రచనలలో సహజత్వం ఉట్టిపడేలా ఉండి, సజీవ రూపాలుగా రూపు దిద్దు కున్నవి. కథలు బాలలకు సులభంగా అర్థమై పోతాయి. ఈమె రాసిన కథల్లో " అనగనగా ఆకలి కథ, ఇల్లు ఇరకాటం, ఆ చంద్రం, దోమ కోతి, తాత అవ్వ కథ, అమ్మమ్మ బహుమానం, " కోతి చేష్టలు", నాలుగు ఏనుగుల కథలు ముఖ్యమైనవి. కామేశ్వరి వ్రాసే నాటికలలో ఉన్న పాత్రలు అన్నీ ఆడపిల్లల పాత్రలే ! పిల్లలను చేరదీసి మంచి అలవాట్లు ఏవో, చెడు అలవాట్లు ఏవో కామేశ్వరి విడ మరిచి చెప్పేవారు. ఆంధ్ర బాలానంద సంఘం కార్యక్ర మాల కోసం తన సొంత భవనాన్ని దారాదత్తం చేశారు. కామేశ్వరి ఆశయాల మేరకు మర్రి చెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జవహర్ బాల భవన్ ఏర్పాటు చేశారు. మండలి వెంకట కృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కామేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ స్థాపన జరిగింది. 1975లో తొలి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సందర్భంగా బాల సాహిత్యానికి చేసిన సేవలకు గాను ఆమెను ఘనంగా సత్కరించడమే గాక 1978లో "బాలబంధు" బిరుదుతో ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ వారు సత్కరించారు. 1981లో కామేశ్వరి రచనలను అన్నింటినీ కలిపి " భోగి పళ్ళు " అనే సంకలనంగా తెచ్చారు. బాలానంద మహోద్యమానికి భర్త న్యాయపతి రాఘవ రావుకు సర్వవిధాలా సహకరిం చిన కామేశ్వరి తన 72వ ఏట 1980 అక్టోబర్ 23వ తేదీన ఈ లోకం వదిలి వెళ్లారు.

# అకాల మృత్యుహరుడు ధర్మపురి యముడు



'భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయాణోన్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురు వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

# వ్యంగ్య చిత్రకారులలో సాటి లేని మేటి

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించ బడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష ఊహా చిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం. ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహ విగ్రహం ప్రతిష్ఠించారు. భారతదేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం. ఆర్.కె.లక్ష్మణ్ గా లబ్ధప్రతిష్టులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 - జనవరి 26 2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించ బడే ఆంగ్ల దిన పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా లో ప్రతిరోజూ వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండేవారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించు కున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయ రంగాన్ని సరైన పంథాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది. లక్ష్మన్ అంటే, రాజకీయ నాయకులందరికీ గౌరవం, అంతకుమించి ఎనలేని ప్రేమ.




2003లో తీవ్ర అస్వస్థులై ఆసుపత్రిపాలైనప్పుడు, దేశంలోని హేమాహేమీలందరూ ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆదుర్దాతో తెలుసు కోవడమే కీఆకుండా, ఉపరాష్ట్రపతి భైరవ్ సింగ్ షేకావత్ తో సహా చాలా మంది ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. ఆర్కే లక్ష్మణ్ మైసూర్ నగరంలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తండ్రి పాఠశాల ప్రధానోపాధ్యయులు. లక్ష్మణ్ ఆరుగురు సంతానంలో చిన్నవాడు. ఆయన అన్నలలో ఒకరైన ఆర్.కె. నారాయణ్ మాల్గుడి డేస్ కథలు రచించిన ప్రముఖ ఆంగ్ల రచయిత కావడం యాదృచ్ఛికం. చిన్నతన నుండి లక్ష్మణ్ కు బొమ్మల పుస్తకాలు చూసే అలవాటు ఉండేది. ఆంగ్ల పత్రికలైన స్ట్రాండ్, పంచ్, బైస్టాండర్, వైడ్-వరల్డ్, టిట్ బిట్స్ వంటి బొమ్మల కార్టూన్ పుస్తకాలను, తాను చదవటం నేర్వకముందే చూసేవాడు. బొమ్మల పుస్తకాలు చూస్తూ, మెల్లిగా గీతలు గీస్తూ బొమ్మలు వెయ్యటం మొదలు పెట్టారు. నేల మీద, గోడల మీద, తలుపుల మీద, ఎక్కడ పడితే అక్కడ రకరకాల బొమ్మలు వేసేవారు. తన ఉపాధ్యాయులనూ వదలక వాటి చిత్రాలుకూడ వేసారు. తాను వేసిన బోధి వృక్షం ఆకు బొమ్మను టీచర్లు కూడా మెచ్చుకున్నప్పుడు తానొక చిత్రకారుడిగా తయారయ్యే అవకాశం ఉన్నదని భావించారు. ఉన్నత పాఠశాల తరువాత, లక్ష్మణ్ బొంబాయి (ఇప్పటి ముంబాయి) లోని జె.జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్ లో చేరి బొమ్మలు వేయటం నేరుకోవటానికి, తన దరఖాస్తు చేశారు. కాని, ఆ పాఠశాల ప్రధాన అధికారి, అటువంటి బొమ్మలు వేసేవాడు తమ స్కూలులో విద్యార్థిగా ఉండ తగడు అని చేర్చుకోలేదని చెపుతారు. అయితే లక్ష్మణ్ ఆ తర్వాత అదే పాఠశాల... ఏ పాఠశాలలో బొమ్మలు వేయటం నేర్చుకోవటానికి ప్రవేశం లభించలేదో, దాని పక్కనే ఉన్న ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో కొన్ని దశాబ్దాల పాటు వారి కార్టూనిస్ట్‌గా ఉండి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవటం ఆయన అకుంఠిత దీక్షకు నిదర్శనం. చివరకు మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. చదివి పట్ట భద్రుడయి, చదువు కొనసాగిస్తూనే బొమ్మలు వేస్తూ , ఫ్రీలాన్స్ (స్వతంత్ర) చిత్రకారునిగా కొనసాగారు. ఆ కాలంలోనె "స్వరాజ్య" అన్న పత్రికలో కార్టూన్లు వేశారు. అలాగే, నారద అనే కార్టూన్ సినిమాకు కూడా బొమ్మలు వేశారు.

### గొల్లపుంత కాలనీలో

# ఖాళీ స్థలాలుగా ఉంటే రద్దు చేస్తాం...

★ స్థలాలలో వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టండి ★ అసంపూర్తి నిర్మాణాలను కూడా ఉపేక్షించం ★ ఇదే చివరి అవకాశంగా భావించండి ★ రద్దు చేసిన పట్టాలు అర్హులైన పేదలకు అందిస్తాం... : ఎమ్మెల్యే వేగుళ్ళ...





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట గొల్లపుంతకాలనిలో ఏళ్ల తరబడి ఇళ్ళు నిర్మించకుండా ఖాళీ స్థలాలు ఉండటం వల్ల అక్కడ పాములు, పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు నిలయంగా మరయని దీనివల్ల అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు.గొల్లపుంత కాలని పై రెవెన్యూ అధికారులు అర్హుల సర్వే నిర్వహించారు.దీనిపై స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సర్వే నిర్వహించిన విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది తో చర్చించారు. ఈ సందర్భంగా సర్వే నివేదిక ను తహసిల్దార్ తేజేశ్వరరావు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హులకు న్యాయం చేయాలనే ఉద్దేశం తో దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. అసలు పట్టదారులనుండి కొనుగోలు చేసి ఉంటున్న వారు, ఖాళీగా స్థలాలు వదిలేసిన వారి పట్టాలు రద్దు చేస్తామని చెప్పారు.పార్టీలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా ఈ కాలనిలో వున్న స్థలాలపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటికే అక్కడ పట్టా లేకుండా ఉంటున్న వారికి తహసిల్దార్ నోటీసులు ఇచ్చారన్నారు. అయితే ఖాళీ స్థలాలు ఉన్న పట్టా దారులకు నోటీసులు ఇచ్చేందుకు వారి చిరునామా కూడా లేదన్నారు. ఇదే చివరి అవకాశం గా భావించి ఖాళీ స్థలాల, సగం కట్టి వదిలేసిన వారు ఎక్కడున్నా వెంటనే తమ పట్టాలతో తహసిల్దార్ కార్యాలయంకు వచ్చి తమ అభ్యర్థనలు తెలియజేయాలని కోరారు. పద్నాలుగు ఏళ్ళుగా నిర్మించకుండా ఉండటం వల్ల ఇక్కడ ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు నివాసాలు గా మారాయన్నారు. అక్కడ నివశిస్తున్న కాలని వసూలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2008లో దివంగత వైఎస్సార్ అక్కడ పట్టాలు ఇచ్చారన్నారు. 2009లో తను ఎమ్మెల్యే అయినా తర్వాత 2011లో 1996 మంది కి ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. రోడ్లు డ్రెయిన్లు నిర్మించి అభివృద్ధి చేశామని చెప్పారు.కాగా చాలా మంది ఇప్పటికీ ఇళ్ళు నిర్మించుకోలేదని పేర్కొన్నారు.దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణం గా తహసిల్దార్ తేజేశ్వరరావు నేతృత్వంలో ఇటీవల ఇంటింట సర్వే చేశారన్నారు. దీనిపై నోటీసులు కూడా ఇచ్చారన్నారు. ఇళ్లు కట్టకుండా 190 మంది ఉన్నారన్నారు. పునాది,స్లాబ్ వేసి నిలిపివేసిన వారు462 మంది ఉన్నారన్నారు. వేరే వారి నుండి కొనుగోలు చేసిన వారు 583 మంది ఉన్నారని తెలిపారు. ఈ అంశాలు జిల్లా కలెక్టర్ కు నివేదిస్తే 791 ఖాళీ స్థలాలు, అసంపూర్తి ఇళ్లు పట్టాలు రద్దు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఇక వేరే పట్టా కొనుగోలు చేసి ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటే వారి అర్హతలను పరిశీలిస్తామని చెప్పారు. వారికి మరో చోట ఎక్కడా ఇల్లు లేకపోతే, అర్హులైతే వారి పేరిట పట్టా ఇస్తామన్నారు. లేకుంటే ఇళ్ళు స్వాధీనం చేసుకుంటామని తేల్చి చెప్పారు.ఇక ఖాళీగా ఉన్న 462 స్థలాల వారు తక్షణమే ప్రభుత్వ గృహ నిర్మాణ రుణం సద్వినియోగం చేసుకొని ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. తాము అధికారం లో ఉన్న 2014- 2019లో రూ 2.50 లక్షలు గృహ నిర్మాణ రుణం ఇచ్చామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి రుణం కూడా ఇవ్వలేదని విమర్శించారు. అసంపూర్తి గా వున్న 462, 190 ఖాళీ స్థలాలు కలిపి 650 ఇళ్ల స్థలాలు వస్తాయని పేర్కొన్నారు. దీంతో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇల్లు నిర్మించకుండా ఖాళీ స్థలాలు వదిలేసినవారు చివరి అవకాశం గా భావించి త్వరపడి బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీ స్థలాల వల్ల అక్కడ కాపురాలు ఉంటున్నవారు పాముల బెడదతో సతమతమ వుతున్నారని దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గతంలో పట్టాలు లేనివారు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని సచివాలయాల్లో సొమ్ములు చెల్లించారని అవేమీ చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. వారిలో కూడా అర్హులు ఉంటేనే ఆయా ఇల్లు వారికి ఇస్తామని అర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. కాగా మున్సిపాలిటీలో పన్ను వేయించుకున్న, మార్చుకున్న వారి పేర పట్టా లేకుంటే వారి అర్హతలు కూడా పరిగణలోకి తీసుకొని ఒక్క ఇల్లు మాత్రమే ఉంటే పట్టా ఇస్తామని అలా కాకుండా టౌన్ లో మరికొన్ని ఇళ్లు వారి కుంటే వారి పట్టాలు రద్దుచేసి ఇల్లు స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ నుండి నోటీసులు అందుకున్న వారంతా తమ అభ్యర్థనలు, అభ్యంతరాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎన్నికల డిటి మెహర్ బాబా రెవెన్యూ సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి

# కలెక్టర్ చేతులు మీదుగా ఆర్థిక సాయం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాలెం చెందిన వానపల్లి విదేశాలలో ఉపాధి పొంది కుటుంబాన్ని పోషించుకునే నిమిత్తం ఇజ్రాయిల్ దేశంలో (అష్దాద్) ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ఉపాధి నిమిత్తం చేరి మిషిన్ శుభ్రం చేస్తూ ఉండగా ప్రమా దవశాత్తు జారిపడి నట్లు గమనించి అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే సిపిఆర్ చేస్తుండగా మరణించి నారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు వానపల్లి సత్తిరాజు కుమారుడు వానపల్లి ప్రసాద్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం మండ లం రావుల పాలెం గ్రామం కొత్తకాలనీకి చెందిన వాస్తవ్యుడన్నారు అయితే ఆ ఫ్యాక్టరీ వారు మృతుని యొక్క కుటుంబానికి ఫోన్ చేయగా వారు కంగారు పడి సహాయం నిమిత్తం స్థానిక శాసనసభ్యులు బండారు సత్యా నంద రావు వారిని సంప్రదించగా కోనసీమ వలసదారుల కేంద్రాన్ని అమలాపురంలో సంప్రదిస్తే తగు పరిష్కారం లభిస్తుందని తెలిపారన్నారు. ఆ మేరకు బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సంప్రదించి వానపల్లి ప్రసాద్ మృతదేహాన్ని భారతదే శానికి తీసుకుని వచ్చేందు కు చర్యలు చేపట్టాలని కోరారన్నారు. కోనసీమ మైగ్రేషన్ బృందం వెంటనే మృతుని కుటుంబ సభు లు ద్వారా మృతుని వివ రాలు తెలుసుకొని వెంటనే భారత రాయబార కార్యాల యానికి తెలిపి ఇజ్రాయెల్ దేశంలో ఇజ్రా యెల్ కన్స్ట్రక్షన్ తెలుగు వర్కర్స్ అసోసియేషన్ తరపున కేసీఎం బృందం వానపల్లి ప్రసాద్ (మృతుడు)కి సంబంధించిన అన్ని విషయాలు దగ్గరుండి చూస్తున్నట్టు ఆయన తెలిపారు కెసిఎం బృందం అనుక్షణం కాంటాక్ట్‌లో ఉంటూ వానపల్లి ప్రసాద్ మృతదేహన్ని ఇండియాకు తీసుకున్న రావడానికి కావలిసిన ప్రతి డాక్యుమెంట్ వారికి అందించి, కావలిసిన ధ్రువప త్రాలు మెయిల్ ద్వారా పంపి, టాక్సీకాలజీ పరీక్ష కోసం తండ్రి దగ్గర నుండి అంగీకార పత్రాలను ఇజ్రాయిల్ లోని భారత రాయ బార కార్యలయానికి పంపించి. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ వానపల్లి ప్రసాద్ మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రం గవర్నమెంట్ అఫ్ ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వం,ఎ పిఎన్ఆర్‌టి, ప్రొటెక్టర్ అఫ్ ఇమీగ్రేంట్స్, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖతో వారితో సంప్రదిం పులు జరిపి వానపల్లి ప్రసాద్ మృత దేహాన్ని తల్లితండ్రులుకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మృతుడి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడు తున్న దృష్ట్యా ఇజ్రాయెల్ కన్స్ట్రక్షన్ తెలుగు వర్కర్స్ అసోసియేషన్ తరుపున ఏర్పాటు చేసిన రూ 2 లక్షల 7వేల సొమ్మును మృతుడి కుటుంబానికి అందించటం జరిగిందన్నారు ప్రభుత్వం ద్వారా తగిన సహాయ అందిస్తామని కంపెనీ ద్వారా అందవలసిన ఇన్సూరెన్సులు ఉంటే వాటిని రాబట్టే ప్రయత్నం చేస్తామని త్వరలో మృత దేహాన్ని కూడా అందరి సహకారంతో ఇండియాకు తీసుకువస్తామని తెలిపారు మృతుడి తండ్రి సత్తి రాజును. సోదరులను ఓదార్చి వారికీ ధైర్యాన్ని నింపారు ఎవరైనా ఇతర దేశాలకు వెళ్లి అక్కడ ఉద్యోగాలు పొందా లనుకుంటే వారు ఒక సరైన అను మతులు ఉన్న ఛానెల్ ద్వారా మాత్రమే వెళ్లాలని అదేవిధంగా భారత ప్రభుత్వం ధ్రువీకరించిన రిజిస్టర్డ్ ఎజెన్సీల ద్వారా మాత్రమే వెళ్లాలని ఉపాధి నిమిత్తం వెళ్లే ప్రతి ఒక్కరు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కోన సీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించి పూర్తి వివ రాలు తెలుసుకుని వారి మార్గ నిర్దేశంలో వెళ్లాలని అయన కోరారు. కెసిఎం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ యొక్క సహాయక చర్యలలో నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి జి.రమేష్, సిబ్బంది ఎం ఎం సఫియా సత్తిబాబు, దుర్గా పాల్గొన్నారు.



# అల్లవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం పోలీసు స్టేషన్ ను బుధవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ పోలీస్ స్టేషన్ లను సందర్శిస్తూ సిబ్బందికి సూచనలు జారి చేస్తున్నారు. శాంతి భద్రతల విషయంలో రాజిపడేది లేదని, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశాలు జారీచేయడం జరిగింది.

### అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించిన

# ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన గ్రామంలో నిర్మాణ పనులు చేపట్టిన అన్న క్యాంటీన్ భవనాన్ని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి పరిశీలించారు.స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తో కలిసి ఈ పనులను పరిశీలించిన ఎంపీ హరీష్ మాట్లాడుతూ త్వరలోనే ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి అన్న క్యాంటీన్ ను ప్రారంభిస్తామని తెలిపారు.పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో 5 రూపాయలకే భోజనాన్ని అందించడం కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.ఇప్పటి వరకూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఈ అన్న క్యాంటీన్లను త్వరలో మండల కేంద్రమైన గ్రామాలలో అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొస్తుందని ఎంపీ హరీష్ పేర్కొన్నారు.

### కార్తీక మాసం సందర్భంగా

# పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, నదీ తీరాలు, కార్తీక వన భోజన ప్రదేశాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో, జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధాన అంశాలు రద్దీ నియంత్రణ, కార్తీక సోమవారాలు, పౌర్ణమి రోజున ముఖ్యంగా శివాలయాలు, నదీ స్నాన ఘట్టాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలి.

**ట్రాఫిక్ నియంత్రణ:** రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పార్కింగ్ స్థలాలను ముందే గుర్తించి, వాటి గురించి భక్తులకు తెలియజేయాలి.

**మహిళా భద్రత:** మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. షీ టీమ్స్ నిఘా పెంచాలి.అగ్ని ప్రమాదాలు వన భోజనాల ప్రాంతాల్లో, దీపారాధన చేసే చోట అగ్నిమాపక జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎస్పీ మాట్లాడుతూ "కార్తీక మాసం ప్రజల మనోభావాలకు సంబంధించిన పవిత్ర మాసం. పోలీస్ అధికారులు భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తులు తమ పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలి"అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ప్రత్యేక దిశానిర్దేశం చేశారు.


# జాతీయస్థాయి బోట్ ఫెస్టివల్‌కి సహకరించండి : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధికి సహకారం అందించాలి ప్రాజెక్ట్ ఈడీతో చర్చించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విజయవాడ లో ఏ.పి.టి.డి.సి ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యం.శేషగిరిని కలిశారు.రానున్న సంక్రాంతికి ఆత్రేయపురం వద్ద నిర్వహించనున్న జాతీయ స్థాయి బోట్ ఫెస్టివల్‌కు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.ఈసారి జాతీయ స్థాయిలో పడవల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో లొల్ల లాకుల వద్ద టూరిజం అభివృద్ధి మరియు వాడపల్లిలో రివర్ ఫ్రంట్ రిసార్టుల నిర్మాణంతో పాటు వాడపల్లి, మందపల్లి, పలివెల, ర్యాలి మొదలైన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను కలుపుతూ బస్సులు ఏర్పాటు కొరకు అనుమతులు, టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు.

# కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు

### 35 రోజులకు శ్రీవారి మెయిన్ హుండీ ఆదాయం రూ.1 కోటి, 87 లక్షల, 33 వేలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 35 రోజులకు గాను మెయిన్ హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. భక్తులు భారీగా తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. 1 కోటి 87 లక్షల 33 వేల 487 రూపాయలు రాగా, 47 గ్రాముల బంగారం, ఒక కేజీ 240 గ్రాముల వెండి భక్తులు వేసినట్లు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు ప్రకటించారు. ఆరు దేశాలకు సంబంధించి 25 కరెన్సీ నోట్లు భక్తులు మొక్కుబడిన చెల్లించుకున్నారు. హుండీల లెక్కింపులో మందపల్లి ఏసి సురేష్ బాబు ఇన్స్పెక్టర్ రామలింగేశ్వరరావు, గ్రేడ్-2 ఈవో పీవీఎస్ కామేశ్వరరావు కెనరా బ్యాంక్ సిబ్బంది చైతన్య గ్రామీణ బ్యాంక్ సిబ్బంది ఆలయ అర్చక స్వాములు సిబ్బంది పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు జడ్జ్‌పై దాడి ఖండిస్తూ వినతిపత్రం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సేన అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలు దళిత సంఘాలు, నాయకులు, ప్రజాసంఘాలు, బార్ అసోసియేషన్ సభ్యులు, మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేసారు. అనంతరం రామచంద్రపురం డివిజన్ రెవిన్యూ ఆఫీసు నందు డిటీకి వినతి పత్రం అందజేయడం జరిగింది.

# కౌన్సిలర్ కాటుకి బలైన మైనర్ బాలిక



**తుని, విశ్వం వాయస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తునిలో వెలుగులోకి వచ్చిన వృద్ధ కీచకుడి రాసలీల బాగోతం. మైనర్ బాలికపై అత్యాచారయత్నం కి పాల్పడిన టిడిపి నేత తాటిక నారాయణ రావు. తుని రూరల్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక. మంగళవారం బాలికను హాస్టల్ నుండి తీసుకువెళ్లి హంసవరం సపోటా తోటల్లో అత్యాచార యత్నానికి పాల్పడిన వృద్ధుడు. కాగా విద్యార్థినిపై రాసలీలలకు పాల్పడిన టిడిపి నేత తాటిక నారాయణరావును కఠినంగా శిక్షించాలని తుని పట్టణ సీనియర్ టీడీపీ నేత మాజీ ఛైర్మెన్ ఇనుగంటి సత్యనారాయణ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనలోఎలాంటి రాజకీయ జోక్యం ఉండబోదని స్పష్టం చేసిన ఇనుగంటి చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. ఇలాంటి దుర్మాగ చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వృద్ధుడైన నిందితుడిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇనుగంటి పోలీసు అధికారులను కోరారు. నిందితుడిని శిక్షించి బాధిత మైనర్ బాలికకు న్యాయం చేకూరుస్తామని ఇనుగంటి హామీ ఇచ్చారు.

## ఇంటి నిర్మాణానికి జెకెసిటి ఆధ్వర్యంలో సామాగ్రి వితరణ




**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మండలంలోని కారం గూడెం గ్రామానికి చెందిన కారం లాలమ్మ అనే మహిళ ఇల్లు గతంలో గాలి దుమారానికి పూర్తిగా కూలిపోవడంతో ఇల్లు లేక నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతుండడంతో తన పరిస్థితిని తెలుసుకున్న జమాల్ ఖాన్ ఇంటి నిర్మాణానికి బుధవారం నాడు ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు ఇనుప పైపులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి జహంగీర్, పి.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## అధ్యాపకురాలు శకుంతలకు డాక్టరేట్ ప్రధానం




**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనిక శాస్త్ర విభాగాధిపతి కించే శకుంతల, ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయవిశ్వవిద్యాలయం,స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రసాయనిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ సముద్ర నిల్ పాల్ మార్గనిర్దేశకత్వంలో "సింథసిస్ ఆఫ్ నికెల్ అండ్ కాపర్ కాంప్లెక్స్ విత్ యన్,ఓ అండ్ ఓ,యన్,ఓ – డోనార్ లైగాండ్స్ అండ్ అండ్ థైర్ కేటాలైటిక్ అప్లికేషన్స్" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ పరిశోధన మూలంగా చవకైనా ఉత్ప్రేరకాలు ఉపయోగించి పర్యావరణ అనుకూలమైన సింథటిక్ మార్గాల ద్వారా బైఎరైల్స్ మరియు క్వినాజోలినోన్స్ వంటి ఔషధాలకు సంబంధించిన ముఖ్యమైన సమ్మేళనాలను అభివృద్ధి చేయడం మరియు క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ సవాళను పరిష్కరించడమే కాకుండా రసాయన పరిశోధనలో సుస్థిరమైన పద్ధతులను కూడా ప్రోత్సహిస్తుంది. డాక్టరేట్ పొందిన శకుంతలను చింతూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్న మాణిక్యం, సహచర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రశంసించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ తమది వ్యవసాయ కుటుంబం తండ్రి కించే మత్స్యరాజు, తల్లి కించే చిన్న తల్లి దంపతుల కుమార్తెగా తానెంతో గర్వపడుతున్నానని, ఈ పరిశోధనలో తనకు సహకరించిన ప్రొఫెసర్. సముద్రనిల్ పాల్, తన భర్త అద్దంకి సుధాకర్, సోదరి విజయభారతి– డాక్టర్.డాల్ పడాల్ మామయ్య, సోదరుడు కించే రవికుమార్, కుటుంబ సభ్యులందరికీ శకుంతల కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్సాహంగా సాగిన మండలస్థాయి క్రీడా పోటీలు

**నూతన పిఈటి లో పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపికలు**

**అండర్ 14,17 విభాగంలో 35 మంది విద్యార్థుల ఎంపిక - నేటి నుంచి డివిజన్ స్థాయి క్రీడా పోటీలు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్14,17 విభాగంలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ సారథ్యంలో, నూతనంగా విధుల్లో చేరిన పిఈటిల పర్యవేక్షణలో సాగిన క్రీడాకారుల ఎంపికల ను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు ప్రారంభించగా, విద్యార్థులకు అథ్లెటిక్స్( 100,200 మీటర్ల రన్నింగ్, షార్ట్ పుట్, జావెలిన్ త్రో) , బ్యాడ్మింటన్, యోగా లలో ఎంపికలు జరగగా, విద్యార్థులలో మొత్తంగా బాలుర, బాలికల విభాగాల్లో మండల వ్యాప్తంగా 35 మందిని సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. వీరంతా అక్టోబర్ 23వ తేదీ నుండి డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో రాయవరం మండలం తరపున పాల్గొంటారని ఎంఈవో సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని పలు పాఠశాలకు చెందిన 14,17 వయస్సు కలిగిన విద్యార్థులు, ఆయా పాఠశాలలకు చెందిన పిఈటీలు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ప్రత్తిపాడులో నవంబర్ 3న

# కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చన : పత్రి రమణ



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర కార్తీక మాసంలో నవంబర్ 3 అనగా సోమవారం ప్రత్తిపాడులో డిసిసిబి బ్యాంకుకి వెనక ఉన్న ఖాళీ స్థలంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆశీస్సులతో ప్రముఖ పురోహితులు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు గురుభవాని పత్రి రమణ మీడియాతో అన్నారు. ఈ సందర్భంగా పత్రి రమణ మీడియాతో మాట్లాడుతూ 1000/–రూపాయల టికెట్ తీసుకుని ఈ మహా యజ్ఞంలో పాల్గొనే 500 మంది దంపతులకు మొత్తం పూజా సామాగ్రి అందిస్తామని, 500 శివ లింగాలకు స్వయంగా అభిషేకం చేసే అవకాశంతో పాటు కోటి దీపాలను వెలిగించడంలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుండే వివిధ రకాల ప్రత్యేక పూజలతో పాటు 24 రకాల ద్రవ్యాలతో పరమశివుడికి మహా కుంభాభిషేకం జరుగుతుందని, ఆసక్తి ఉన్న భక్తులు 9949874380, 9182547897 నెంబర్లకి ఫోన్ చేసి పేరు నమోదు చేయించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభకు, ఆమె అనుచరులకు, అయ్యప్ప స్వాములకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కోటి దిపోత్సవం నిర్వహణ పనులను మాజీ ఎంపీటీసీ చిలకమర్తి వీరభద్రం, పోలిశెట్టి శ్రీను, గానాల గంగాధర్, రాయుడు దొరబాబు తదితరులతో కలిసి ఆయన పర్యవేక్షించారు.

# నవంబర్ 16న ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తీక వనసమారాధన

**జాతి సమైక్యత కోసం వన సమారాధనలు - వన సమారాధన పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి**

**రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేద్దాం - మంత్రి సుభాష్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే నవంబర్ 16న అమలాపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక వనసమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. అమలాపురంలోని కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్దగల శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, శెట్టిబలిజ సంఘం పెద్దలు వాసంశెట్టి సత్యం తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా,జాతి ఐక్యత కోసం ప్రతి ఏడాది భారీ స్థాయిలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించుకోవడం సాధ్యమన్నారు. శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు పునః రంకితమవుదామన్నారు. వచ్చే నెలలో తాను ప్రకటించిన కోటి రూపాయల విరాళాన్ని ఎస్ ఏ ఎఫ్ నిధికి జమ చేస్తానని అన్నారు. కొంతమంది రాజకీయ స్వార్థపరులు తమ స్వలాభం కోసం తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని తిప్పి కొడుతున్నానన్నారు. అలాంటి వారికి ప్రజలే బుద్ధి, గుణపాఠం చెబుతారన్నారు. కుల ఐక్యత వల్లే తనకు మంత్రి పదవి వచ్చిందని సగర్వంగా చెప్పారు. జాతిని తాకట్టుపెట్టే నేతలను దూరంగా పెట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలో పదవతరగతి పరీక్షలలో 500 పైబడిన మార్కులు సాధించిన ప్రతీ శెట్టిబలిజ విద్యార్థినీ, విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో శెట్టిబలిజ సోదరులకు తాను అండగా ఉంటానని ఆయన అన్నారు. ఆపదలో ఉన్న శెట్టిబలిజలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని గుత్తుల మీరా కుమార్ తెలియజేశారు. ఈ వనసమారాధనకు ఉభయ గోదావరి జిల్లాలోని పలు మండలాలలో ఉన్న శెట్టిబలిజ సోదరీమణులకు వనసమారాధనకు వచ్చేందుకు వీలుగా ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతీ ఒక్కరూ కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ వనసమారాధనను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక వనసమారాధన ఆహ్వాన పత్రికను రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్ఎల్సి కుడుపూడి సూర్యనారాయణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గుత్తుల మీరాకుమార్, వాసంశెట్టి సత్యం, కడలి ఈశ్వరి, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టపర్తి భారతి తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దొంగు శ్రీను, చొల్లంగి వెంకటరమణ, రాయుడు సత్యరుషి, చూట్టూరి పెదబాబు, ఉభయ గోదావరి జిల్లాలోని శెట్టిబలిజ సంఘ సోదర, సోదదీమణులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారంతో పాటు,

# ప్రభుత్వ ఉద్యోగం అందించాలి

**బాధిత కుటుంబాల బాధ్యత ప్రభుత్వానిదే..**

**అగ్నిప్రమాద ఘటనపై ప్రజా సంఘాల డిమాండ్**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడం కేవలం కంటితుడుపు చర్య మాత్రమే అని బుధవారం ప్రజాసంఘాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.15 లక్షల నష్టపరిహారం ప్రజా సంఘాల పోరాట ఫలితం అయినప్పటికీ, పరిహారం తో ప్రభుత్వం చేతులు దులుపుకోవడం కాక బాధిత కుటుంబాల పిల్లలను ప్రభుత్వమే చదివించాలని, మృతుల కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వ భీమా పాలసీ చేయించాలన్నారు. గుర్తింపు లేని, నిబంధనలు పాటించని పరిశ్రమలను తక్షణమే మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందినవారు ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన కార్మికులని వారిపై ఆధారపడి చిన్నపిల్లలు, వృద్ధులు బ్రతుకుతున్నారని వారి జీవితాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ,కార్మికుల ప్రాణాలతో ఆటలు ఆడే ఫైర్ వర్క్స్ యజమానులు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం బాధిత కుటుంబాల పునరావాసానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని బాణాసంచా యూనిట్లను తక్షణమే తనిఖీ చేసి, భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలను రద్దు చేయాలని పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజారెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వారి వెంట వీర్రాజు, తేజా, ఏ.చంటి, పి.ప్రభాస్, అర్జున్ తదితరులు ఉన్నారు.

అమలాపురం హోటల్స్‌పై

# దుష్ప్రచారాన్ని ఖండించిన చాంబర్ ఆఫ్ కామర్స్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం వర ప్రసాద్ ఆధ్వర్యంలో అమలాపురం కోకస్ లాడ్జి లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం వర ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల ఒక యువకుడు బిర్యానీ తిని మృతి చెందాడని ఒక అవాస్తవమైన వార్త సోషల్ మీడియాలోని వైరల్ అయిందని, బిర్యానీలో వచ్చింది మండ్రకప్ప, తేలు, వంటివి కాదని వీడియో కూడా నిజమైనది అని ఎవరు ధ్రువీకరించలేదని, అవాస్తవం అని ఆయన అన్నారు. అతను బిర్యానీ తిని మృతి చెందలేదని, బ్లెడ్ క్లాట్ అవడం వలన హార్ట్ స్ట్రోక్‌తో మృతి చెందడం జరిగిందని మృతుడి తండ్రి, బంధువులు కూడా తెలిపారని, అలాగే వైద్యులు కూడా గత మూడు నెలలుగా అతని ప్రైవేట్ హాస్పటల్ లో వైద్యం చేయించుకుంటున్నాడని, అతను అనారోగ్య సమస్యలతో హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందాడని, ధ్రువీకరించారు సోషల్ మీడియాలో ఏదైనా వార్త వస్తే అది నిజమా, కాదా అని నిర్ధారించుకుని షేర్ చేయాలని అన్నారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులను కూడా ఎటువంటి కంప్లైంట్లు రాలేదని దృవీకరించారు, ఈ ఘటనపై హోటల్ ప్రతినిధులు మాట్లాడుతూ అవాస్తవాలు షేర్ చేయడం వలన హోటల్ వ్యాపారులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి తండ్రి గంగాధర్ తన కుమారుడు అనారోగ్యం కారణం వల్లనే చనిపోయాడని, తల్లిదండ్రులు చెప్తుంది నికరమని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దని, తన కుమారుని మృతిని వ్యక్తిగత కారణాలతో ప్రచారం చేయవద్దని, ఇలాంటి వార్తలని వైరల్ చేయటం సరికాదన్నారు. దీనిని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరపున వ్యాపారస్తులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు కొమ్మూరి వెంకటాచలప్రసాద్, చాంబర్ సలహాదారులు నల్లా పవన్ కుమార్, హోటల్స్ అసోసియేషన్ సెక్రటరీ కోకా రాంబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నల్లా విష్ణు మూర్తి (విష్ణు శ్రీ రెస్టారెంట్), గారపాటి వంశీ, (జీకే రెస్టారెంట్ ) బాలూ (గణపతి రెస్టారెంట్ ), సురేష్ నాయుడు (హ్యాపీ రెస్టారెంట్), డి.నాయుడు (గ్రీన్ పార్క్) చిక్కం గణేష్ (బొండం బాబాయ్ హోటల్), హరిబాబు (తారా రెస్టారెంట్),వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను తప్ప ఇతరులను హాస్టల్ దగ్గరకు అనుమతించకూడదు..

**- తప్పు చేసినవారిపై చర్యలు తప్పవని హెచ్చరిక - ఎవరినీ కొమ్ముకాసే పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో ఉండవ్**
**- ఘటనపై పోలీసులు తక్షణం స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. - వైసీపీ వాళ్ళు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప రాజకీయం చేయడం తగదు**
**- హాస్టల్స్ కి కనీస సదుపాయాలు కూడా కల్పించనివాళ్ళు విమర్శలేల - బిసి హాస్టల్ బాలిక ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే వాసు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఒక బిసి హాస్టల్ కి చెందిన బాలికపై జరిగిన అఘాయిత్య ఘటనకు సంబంధించి చర్యలు తీవ్రంగానే ఉంటాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. తప్పుచేసినవారికి కొమ్ముకాయడం ఉండదని ఆయన స్పష్టంచేసారు. ఈ ఘటనపై పిర్యాదు అందినవెంటనే పోలీసులు ఎఫ్ ఐ ఆర్ కట్టారని ఆయన గుర్తుచేసారు. స్థానిక బిసి హాస్టల్ లో 10వ తరగతి విద్యార్థినిని అజయ్ అనే యువకుడు తీసుకెళ్లి, మరో యువకుడితో కల్సి అత్యాచారం చేసినట్లు వచ్చిన వార్తపై ఎమ్మెల్యే వాసు స్పందించారు. వివరాలు ఆరా తీశారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే వాసు తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సోదరుడు సాకుతో వచ్చిన ఆ యువకుడితో బయటకు వెళ్ళడానికి వార్డెన్ పై వత్తిడి తెచ్చి సదరు బాలిక వెళ్లడం, అక్కడ మరో యువకుడితో కల్సి లాడ్జికి వెళ్లి రెండు గంటల తరవాత తీసుకొచ్చి దేవీచౌక్ లో వదిలేసి వెళ్లినట్లు, వంటిపై గాయాలు చూసి వార్డెన్ ఆరా తీయడంతో విషయం మొత్తం చెప్పడం, దీనిపై కాకినాడలో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు, దీంతో వారు వచ్చి టు టౌన్ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెల్సిందని ఆయన పేర్కొన్నారు. దీపావళి రోజు అర్ధరాత్రి 12గంటలు దాటాక వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్ కట్టారని ఆయన అన్నారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. ఒక గుణపాఠంగా నేర్చుకుని, తల్లిదండ్రులకు తప్ప ఇతరులెవరు వచ్చినా వాళ్ళతో మాట్లాడ్డానికి గానీ, బయటకు వెళ్ళడానికి అనుమతించకూడదని ఆయన అన్నారు. తల్లిదండ్రులు ఆధార్ కార్డుల ఆధారంగా వారిని అనుమతించాల్సి ఉందన్నారు. ఎక్కడో జొన్నాడ నుంచి వచ్చిన యువకుడు ఈవిధంగా అబద్ధాలు చెప్పి బాలికను తీసుకెళ్ళడం దారుణమన్నారు. లోకంలో మంచితో పాటు చెడు కూడా ఉంటుందని, ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. తప్పు జరిగాక చర్యలు తీసుకోవడం కంటే తప్పు జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు ఎంతోనమ్మకంతో చదువుకోడానికి పంపించినపుడుఎలాంటి వత్తిడులకు లోనుకాకుండా, తల్లిదండ్రులకు మచ్చరాకుండా చూడాలని ఎమ్మెల్యే వాసు సూచించారు. ఏ ఐ టెక్నాలజీ కూడా రావడంతో మరిన్ని ఇబ్బందులు వస్తాయని అన్నారు. ఇక మగపిల్లలకు తల్లిదండ్రులు కూడా సంస్కారం నేర్పాలని, ఆడపిల్లల విషయంలో చెడు ఆలోచనలు చేయకుండా చూడాలని, లేనిపక్షంలో ఇలాంటి కేసుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఈ ఘటనలో వార్డెన్‌కి కూడా నోటీసు ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరినట్లు ఎమ్మెల్యే వాసు తెలిపారు. అల్లరి మూకల సంగతి ప్రభుత్వం సిరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. వైసిపి వాళ్ళు హాస్టల్ దగ్గరకు వెళ్లి హడావిడి చేయడం, బాలిక పేరు మీడియాలో చెప్పడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో నిర్మాణాత్మక సూచనలు చేయాలి తప్ప రాజకీయం చేయడం తగదన్నారు. అధికారంలో ఉన్నపుడు హాస్టల్ లో టాయిలెట్స్ వంటి కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా ఇబ్బందులు కల్పించి, ఇప్పుడు రాద్ధాంతం చేయడం వింతగా ఉందన్నారు. ఆ జీవోలు ఉన్నాయి ఈ జీవోలు ఉన్నాయి అనడం కాదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. లిక్కర్ షాపుల్లో డిజిటల్ లావాదేవీలు చేయాల్సి ఉంటె వైసిపి హయాంలో నగదు లావాదేవీలు చేసారు కదా అని ఆయన ప్రశ్నించారు. నిజంగా బాధ్యత ఉంటె మహిళా నాయకురాలిని పంపించి విచారించి, తగు సూచనలు చేయిస్తే, అవి ఆమోదయోగం అయితే స్వీకరిస్తామని ఎమ్మెల్యే వాసు అన్నారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్సకు సదుపాయాలు కలదు..

**ప్రభుత్వ హాస్పిటల్లో క్యాన్సర్‌కి చికిత్స,10 కేజీల కణితి తొలగింపు - రాజమండ్రిలో క్యాన్సర్ చికిత్సా సదుపాయాలు అందుబాటులో..**
**తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు.. : కలెక్టర్ కీర్తి చేకూరి**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ప్రజలు భయపడకుండా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స కోసం ప్రభుత్వ టీచింగ్ జనరల్ హాస్పిటల్ (జిటిజిహెచ్), రాజమండ్రిలో అందచేస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. "ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పుడు క్యాన్సర్ చికిత్సకు పూర్తి సదుపాయాలు ఉన్నాయి. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా జయించడం సాధ్యం. ప్రజల్లో అవగాహన పెంచి, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అలవాటు పెంపొందించుకోవాలి" అని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో 150 మందికి పైగా రోగులకు కీమోథెరపీ చికిత్స విజయవంతంగా అందించబడింది. అదనంగా 300 మందికి పైగా రోగులు మందులు, కౌన్సిలింగ్ ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం సర్జికల్ అంకాలజీ (సర్జికల్ అంక్లాలాజి) (కీమోథెరపీ) మరియు ఇతర అనుబంధ సేవలు జిటిజిహెచ్లో అందుబాటులో ఉన్నాయి. "ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్, మరియు తగిన వైద్య సేవలు అందిస్తున్నాం. రోగులకు మానసిక ధైర్యం కల్పిస్తూ సమగ్ర వైద్య సహాయం అందించడం మా లక్ష్యం. రాజమండ్రి ప్రభుత్వ టీచింగ్ జనరల్ హాస్పిటల్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓ.పి వార్డు నం.45 లో నమోదు చేసుకొని సేవలు పొందవచ్చు" అని డాక్టర్ డి.సమీరాజా (మెడికల్ ఆంకాలజిస్ట్) మరియు డా. స్పందన (రేడియేషన్ అంకాలజిస్ట్) తెలిపారు. ప్రభుత్వ టీచింగ్ జనరల్ హాస్పిటల్, రాజమండ్రి - ఓ.పి వార్డు నం.45 లో పేర్లు నమోదు చేసుకున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. "మన ఆరోగ్యం - మన ప్రభుత్వ ఆసుపత్రిలోనే భరోసా" కల్పించడం జరుగుతోందని వెల్లడించారు. క్యాన్సర్‌ను తొందరగా గుర్తించండి - జీవితం కాపాడుకోండి సాధ్యం అవుతుందని సూచించారు. ఈ 7 హెచ్చరిక సంకేతాలను గమనించండి: గాయం ఎక్కువకాలం నయం కాకపోవడం, మూత్రం లేదా విసర్జనలో మార్పులు, అసాధారణ రక్తస్రావం, ముద్దలు లేదా గడ్డలు ఏర్పడటం, మింగడం లేదా జీర్ణం చేయడంలో ఇబ్బంది, చర్మంలో మచ్చలు లేదా రంగు మార్పులు, నిరంతర దగ్గు లేదా గళం మార్పు ఈ లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే జిటి జిహెచ్ క్యాన్సర్ విభాగాన్ని సంప్రదించండి అని వైద్యులు సూచించారు.

**భారీ 10 కేజీల ట్యూమర్ విజయవంతంగా తొలగింపు :** డా. సమీరా రాజా నేతృత్వంలో వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స రాజమండ్రి ప్రభుత్వ టీచింగ్ జనరల్ హాస్పిటల్‌లో బుధవారం డాక్టర్ సమీరా రాజా నేతృత్వంలోని వైద్య బృందం ఒక మహిళా రోగిపై అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో రోగి పొత్తికడుపులో ఉన్న సుమారు 10 కిలోల బరువైన ట్యూమర్ కాంప్లెక్స్ (ఓవరీయన్ సిస్ట్)ను తొలగించారు. డాక్టర్ సమీరాజి తెలిపిన ప్రకారం, ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని, రోగి ప్రస్తుతం కోలుకుంటున్నారని తెలిపారు. ఈ అరుదైన శస్త్రచికిత్స ద్వారా జిటిజిహెచ్లో అత్యాధునిక శస్త్రచికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయనే విషయం మరోసారి రుజువైందన్నారు. డాక్టర్ సమీరా రాజా వైద్య బృందాన్ని పలువురు అభినందించడం జరిగింది.

# జి.జి.యూనివర్సిటీలో ఫీజులు ఒత్తిడి.. : ఎస్.ఎఫ్.ఐ

**జిజి ఇంజినీరింగ్‌లో ఫీజురీయంబర్స్మెంట్‌కి సెమిస్టర్ ఫీజుకి లింక్ తీసేయాలి**






**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫీజురీయంబర్స్మెంట్‌కి సెమిస్టర్ ఫీజుకి లింక్ పెట్టకూడదని ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి డిఆర్ఓకి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ మాట్లాడుతూ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో ఇంజినీరింగ్ కళాశాలలో 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టడానికి మొదటి సంవత్సరం ఫీజు రీయంబర్స్మెంట్ కడితేనే గాని సెమిస్టర్ ఫీజు కట్టకుండా కళాశాల యాప్‌లో పెట్టారని, బలవంతంగా విద్యార్థులను ఒత్తిడి చేస్తూ ఫీజు రీయంబర్స్మెంట్ కట్టమని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం ఫీజురీయం బర్స్మెంట్ వేయకుండా విద్యార్థులు ఎలా కడతారని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టంగా ఫీజు రీయంబర్స్మెంట్ విషయంలో విద్యార్థులను పరీక్ష ఫీజు కట్టే విషయంలో గాని సర్టిఫికెట్ తీసుకునే సమయంలో గాని విద్యార్థులను ఏ కళాశాల యాజమాన్యం ఫీజు రీయంబర్స్మెంట్ కట్టమని ఒత్తిడి చేయకూడదని చెప్పినా జి జి యు యాజమాన్యం ఈ విధంగా వ్యవహరించటంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం కూడా ఫీజు రీయంబర్స్మెంట్ వేయకపోవటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తక్షణమే పెండింగులో ఉన్న 6000 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. డి.ఆర్.ఓ సమాధానమిస్తూ కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్‌తో మాట్లాడామని సెమిస్టర్ ఫీజు కట్టడానికి ఫీజు రీయంబర్స్మెంట్‌కి లింక్ లేకుండా చేస్తామని చెప్పారని అన్నారు. అలాగే ఫీజు రీయంబర్స్మెంట్ ప్రభుత్వం వేసేవరకూ కట్టమని ఒత్తిడి చేయకూడదని ఒత్తిడి చేస్తే కళాశాలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అయితే కళాశాలలో నిన్న ఆందోళన చేసి విద్యార్థులతో చర్చలు జరిపిన అదే రకమైన వైఖరితో యాజమాన్యం ఉండటంతో నేడు కలెక్టరేట్‌కి రావాల్సి వచ్చిందని అన్నారు. అయితే కళాశాల యాజమాన్యం రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకపోతే శనివారం నాడు పెద్ద ఎత్తున విద్యార్థులతో జిజియుని ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు హేమంత్, సాహితి, ఎస్.ఎఫ్.ఐ నాయకులు శ్రీవల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

### గోదావరి బాలోత్సవంలో

# ఆదిత్య వాలంటీర్లు సేవలు అందిచనున్నాము



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల బిజినెస్ స్కూల్ మరియు యానిమేషన్ వింగ్‌కు చెందిన 100 మంది ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు అక్టోబర్ 25 26 తేదీలలో ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం)లో జరగనున్న 'గోదావరి బాలోత్సవం'లో ప్రతి సంవత్సరం పాల్గొన్నట్లే ఈ సంవత్సరం కూడా తమ సేవలు అందించుటకు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో తగు సూచనలు ఇవ్వడం కోసం ఆదికవి విశ్వవిద్యాలయానికి చెందిన పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఆనంద్ వాలంటీర్లతో ఇంటరాక్షన్ సెషన్ నడిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ మరియు ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ జివిఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బిహెచ్‌వి రమాదేవి, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్స్ శిరీష,పోలు కొండసాయి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో కొత్తపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

### 5 రూపాయలకే అన్నార్తుల ఆకలిను తీర్చే అన్న క్యాంటీన్‌లు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐదు రూపాయలకే ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్ కొత్తపేటలో త్వరలో ప్రారంభం కాబోతోంది.ఇది అన్నార్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ప్రధాన పట్టణ కేంద్రాలలో ప్రారంభించారు. నియోజవర్గాల వారీగా అంచలంచలుగా విస్తరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ ఆనాడు తెలియజేశారు. అన్న క్యాంటీన్ అవసరాన్ని గుర్తించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవ తీసుకుని కొత్తపేటలో ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు..స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరుకు కృషి చేశారు. దాని ఫలితంగా కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం కాబోతోంది. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాల్సిందిగా కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కొత్తపేటలో ముఖ్య కూడలిలో అన్న క్యాంటీన్ నిర్మించడం వలన విశేష ఆదరణ కలుగుతుందని పేర్కొనవచ్చు.ప్రభుత్వ ఆసుపత్రి, సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు పూర్వపు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరగా రైతు బజార్ పక్కన బస్టాండ్ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్ నిర్మిస్తున్నారు. అందరికీ అందుబాటులో నిర్మించడం అన్నార్తులకు ఎంతో ప్రయోజనకరం కానుంది.చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ పనులపై మండల కేంద్రం కొత్తపేట వచ్చే ప్రజలకు భోజన సమయంలో ఆకలి తీర్చే అక్షయ పాత్రగా నిలుస్తుందని హర్షిస్తూ మంచి స్థలాన్ని ఎన్నుకుని అన్న క్యాంటీన్ నిర్మిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మరియు కూటమి ప్రభుత్వాన్ని కొత్తపేట నియోజకవర్గ ప్రజానీకం ప్రసంశిస్తున్నారు.అన్ని పనులు పూర్తిచేసి త్వరలో ఈ అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు.

# విద్యా బాలమందిర్ విద్యార్థులు సేవా కార్యక్రమం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు ఎనిమిదవ తరగతి విద్యార్థులచే రావులపాలెం మండలం ఊబలంకలో గ్రామంలో గల మదర్ థెరీసా ఆశ్రమం లో బియ్యం (26కెజీలు), కిరాణా వస్తువులు సుమారు రూ.2000/- విలువ గలవి.ఆశ్రమ నిర్వాహకులు దిడ్ల కిషోర్, ఆశాకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామోజు అనురాధ, ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, శ్యామల, ప్రేమాక్షిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ

### ట్రస్టీలు జక్కంపూడి రామ్మోహనరావు, బొమ్మన రాజ్ కుమార్ జ్ఞాపకార్థం...




**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమఘాట్ రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ అయిన చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు వ్యవస్థాపకులు, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ట్రస్టు చీఫ్ ప్యాట్రన్ బొమ్మన రాజకుమార్ జ్ఞాపకార్థం బుధవారం 150 మంది పేదలకు దుప్పట్లు తువాళ్ళు పండ్లు బన్నులు పంపిణీ చేశారు.ట్రస్టు ఉపాధ్యక్షులు యియ్యపు మురళీధర్,మద్దుల మురళీకృష్ణ, గౌరవ సలహాదారు అశోక్ కుమార్ జైన్,గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా కోశాధికారి మన్యం బాబ్జి,సహాయ కార్యదర్శులు యలమర్తి బాబు,కాలెపు వీరభద్రరావు,దేవత సుధాకర్, డైరెక్టర్లు బూర్లగడ్డ సుబ్బారాయుడు,మండవిల్లి వెంకటరాజు (రాజా),శిఖాకొల్లి సీతారామాంజనేయులు తదితరుల చేతుల మీదుగా వీటిని పేదలకు పంచిపెట్టినట్లు ట్రస్టు డైరెక్టర్ లక్కోజు వీరభద్రరావు (లక్కోజీ) తెలియచేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులకు, పాఠశాలలకు అవసరమైన కంప్యూటర్స్, ప్రింటర్లు, టేబుళ్ళు అందచేస్తున్నామని తెలిపారు. అలాగే పేదలకు దుప్పట్లు తువాళ్ళు పండ్లు బన్నులు నేడు పంపిణీ చేశామని వారు వివరించారు.

# పశ్చిమ గోనగూడెం కోదండ రామాలయంలో వైభవంగా కార్తీక దీపోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం పశ్చిమ గోనగూడెం వెలమల కోదండ రామాలయంలో కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకొని కోదండ రామాలయంలో సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పొన్న చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం రామాలయంలో మహిళలు విష్ణు సహస్రనామం, లలితా పారాయణం గావించి, కార్తీక పురాణం భక్తులకు వినిపించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రొంగల ఎరకయ్య భారతి దంపతులు పొన్న చెట్టును కోదండ రామాలయానికి బహూకరించినట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా కొమరంభీం 124వ జయంతి వేడుకలు

## భీం చిత్రపటానికి ఘన నివాళులర్పించిన ఆదివాసీ నాయకులు



రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ : అల్లూరి సీతా రామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం, దేవారం గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలో ఉన్న రామాలయం నందు గోండు బొబ్బిలి కొమరం భీమ్ 124 జయంతి వేడుకలు సందర్భంగా ఘనంగా పూలమాలలతో నివాళులు అర్పించామని ఏపీ ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఓ ప్రకటన లో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు నైజాం పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీ పోరాటయోధుడు కొమరం భీం జల్ జంగిల్ జమీన్ నినాదం పేరుతో అమాయక ఆదివాసులను చైతన్య పరిచి ఆదివాసీల హక్కులు చట్టాల పరిరక్షణ కోసం, నైజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి అలుపెరగని పోరాటం చేసి వీరమరణం పొందిన ఆదివాసీల ఆరాధ్యదైవం కొమరం భీం అన్నారు. ఈ సందర్భంగా భారత్ ఆదివాసి పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షులు చవలం విద్యాసాగర్ మాట్లాడుతూ కొమరం భీం స్ఫూర్తితో నేటి తరం ఆదివాసీ యువతీ యువకులు షెడ్యూల్డ్ ప్రాంత సంస్కృతి పరిరక్షణ కోసం,నిధులు,నీళ్ళు,నియమకాలు ఆదివాసీలకే దక్కాలని శాంతియుత ఐక్య పోరాటాలకు,మలిదశ ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తక్షణమే స్పందించి టి.ఏ.సి ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించి ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, అలాగే 35 ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు మరియు ఉపాధి అవకాశాలు స్థానిక ఆదివాసీలకు మొదటి ప్రయారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే ఆదివాసీలంతా భవిష్యత్తులో ఓటు బ్యాంకుతో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యూత్ కన్వీనర్ మరియు శరభవరం,దేవారం ఎంపీటీసీ సభ్యులు తుర్రం జగదీష్ దొర, కారం రంగారావు దొర, కారం సత్యనారాయణ దొర, మడకం కృష్ణ దొర,కుంజం అబ్బులు దొర, చవలం వెంకాయమ్మ, తాటి గంగాభవాని, కారం శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పిఎంపి, ఆర్ఎంపిల జాయింట్ ఏక్షన్ కమిటీ సమావేశం

## త్వరలో గ్రామీణ వైద్యుల మహాసభ



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక కెఎస్ఆర్ హాస్పిటల్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనుభవ ప్రాథమిక వైద్యులకు సంబంధించి మూడు ఫెడరేషన్ల అనుబంధ సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. నవంబరు 29 శనివారం ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల గుర్తింపు, వృత్తి పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిఎంపి, ఆర్ఎ పిల జాయింట్ ఏక్షన్ కమిటీ (జేఏసీ) పక్షాన సుమారు 3000 మంది సభ్యులతో భారీ మహాసభ ఏర్పాటు చేయాలని నిర్ణయిచారు. ఎపిఆర్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్స్ కంబాల బాబూరావు, కరెళ్ళ గణపతిరావు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్స్ ఎండి రఫీ, లంక సత్యనారాయణ,బళ్ళ శ్రీనివాసరావు, కొమ్మా శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, తోరాటి ప్రభాకరరావు, ధన్యుని సత్యనారాయణ (కోటిబాబు),బి.నాగేశ్వర రావు,వజ్రపు వినోద్ కుమార్,మీర్జా అలీ, చిన్నా. గుండేపల్లి ప్రసాద్, ఈసరపు శివబాబు, పక్కుర్తి సత్యనారాయణ, వి.వరప్రసాద్ బాబు, కన్నాబత్తుల శ్రీనివాసరావు, ఎస్‌కె ఇమామ్, ఎస్.కె సిద్ధూ, దబ్బాడ రాంబాబు, ఎంవివి సత్యనారాయణ, నిడమర్తి సత్తిరాజు, చిక్కాల రామచంద్రరావు, ఎంవి రాజు, డివివి సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# సౌభాగ్య ఆప్టికల్స్‌లో ఘనంగా లక్ష్మీపూజ

## ఉచిత కంటి పరీక్షలు, ఉచిత కంటి ఆపరేషన్స్ చేయిస్తున్నాం - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి






రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమహేంద్రవరం గంటలమ్మ గుడి డౌన్‌లో సౌభాగ్య ఆప్టికల్స్ దీపావళి సందర్భంగా నిర్వహించే లక్ష్మీపూజకు నగర ప్రముఖులు విచ్చేశారు. సౌభాగ్య అప్టికల్స్ అధినేత మరియు ఛాంబర్ అఫ్ కామర్స్ డైరెక్టర్ హనుమాన్ సింగ్‌కు నగర ప్రముఖులు పలువురు దీపావళి శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ సందర్భంగా సౌభాగ్య ఆప్టికల్స్ నిర్వాహకులు మాట్లాడుతూ నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియచేసారు. దీపావళి సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు మరియు ఉచిత కంటి ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని, ఈ అవకాశం ఉపయోగించుకోవాలన్నారు.

# సంక్షేమ హాస్టల్‌లో బాలికలకు రక్షణ కొరవడింది

## రాజమండ్రి బాలికపై జరిగిన అత్యాచారం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి
## - నిందితుడు పై కిడ్నాప్, కఠినమైన చట్టాలు నమోదు చేయాలి.
## సంక్షేమ హాస్టళ్ల బాలికలకు పటిష్ట భద్రత కల్పించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : సంక్షేమ హాస్టల్‌లో చదువుకుంటున్న బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, కిడ్నాప్ కేసు కూడా పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. నగరంలో సంక్షేమ హాస్టల్ బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి స్పందించారు. సంక్షేమ హాస్టల్‌లో బాలికలకు రక్షణ కొరవడిందని అన్నారు. బాలిక ఫిర్యాదు చేసేంత వరకు హాస్టల్ నిర్వాహకులు కనీస విచారణ చేపట్టకపోవడం దారుణం అన్నారు.ఘటన పరిశీలిస్తే అనేక అనుమానలు కలుగుతున్నాయని కాబట్టి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంక్షేమ హాస్టల్ లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బాలికలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

# అనితమ్మ హోమ్ శాఖపై పవన్ కళ్యాణ్ పగ బట్టరా..!

## అనితమ్మ సహనం పవన్ కళ్యాణ్‌కు అలుసుగా మారింది - రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధినేత మేడా శ్రీనివాస్ సందేహాలు





రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరుగుతున్న నేరాలపై దృష్టి సారించని మన పవన్ కళ్యాణ్ భీమవరంలో జూదాల కోసం డి.ఎస్.పి జయసూర్యపై సీరియస్ అవ్వటమా !ఈ అంశంలో మరో కోణం వుంది అనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ డిఎస్‌పిపై ఉన్నత అధికారులకు ఫోన్ ద్వారా నివేదిక కోరటం కాదు. అంతర్గత నివేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెప్పించుకుంటే కొన్ని కొత్త కోణాలతో వాస్తవాలు భహిర్గతం అవుతాయి. నిజానికి పవన్ కళ్యాణ్ సొంత శాఖపై కన్నా ఇతరుల శాఖ పైనే ఎక్కువగా దృష్టి సారించటం కూడా అనేక అనుమానాలకు తావునిస్తుంది. పలుమార్లు హెూమ్ మంత్రి అనితమ్మ శాఖనే పవన్ కళ్యాణ్ ఉద్దేశ్య పూర్వకంగా టార్గెట్ చేస్తుండటం కూడా బాధాకరం. పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గంలో దళితులను సాంఘిక భహిష్కరణ చేసినా, చిత్తూరు జిల్లాలో సొంత శాఖపై దాడులు చేసినా , కందుకూరులో తన సొంత సామాజిక వర్గం లక్ష్మి నారాయుడిని అత్యంత పాశవికంగా హత్య చేసినా, సుగాలి ప్రీతి,ఆయాషా మీరా హత్యలు, పసిపిల్లలపై జరిగే అఘాయిత్యాలు పవన్ కళ్యాణ్ కు కనపడక పోవటం ఆశ్చర్యం. నిత్యం అనితమ్మ శాఖ పైనే దృష్టి పెట్టడం.ఆ శాఖ ప్రతిష్టను భ్రష్టు పట్టించటమే పవన్ కళ్యాణ్ ప్రధాన కర్తవ్యంగా కనపడుతుంది.అనితమ్మ సహనం కోల్పోతే పవన్ కళ్యాణ్ కు గడ్డు పరిస్థితులు తప్పవు. యావత్ ఆంధ్ర రాష్ట్రంలోనే మద్యం ,ఇసుక, మత్తు ప్రదార్ధాలు, ఇతర కొన్ని నేరాలు గ్రామాల్లో సాశిస్తుంటే పవన్ కళ్యాణ్ కు భీమవరం పేకాటనే కనబడిందా ! భీమవరం ప్రక్కనే పవన్ కళ్యాణ్ సహచర మంత్రి ఆధ్వర్యంలో బాహటంగా పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నా అనితమ్మ శాఖ పైనే ఎక్కువగా పవన్ కళ్యాణ్ గురి పెట్టడంపై అనేక సందేహాలు షికార్లు చేస్తున్నాయి. అనితమ్మ శాఖపై ఇదే విధంగా పవన్ కళ్యాణ్ నిత్యం పెత్తనం చెలాయిస్తే అనితమ్మ సామాజిక వర్గం నుండి పవన్ కళ్యాణ్ కు నిరసన సెగ తప్పదు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం యంజయ్ చేస్తున్న శాఖపై నిరుత్సాహం తోనే పవన్ కళ్యాణ్ అనితమ్మ శాఖలో పలుమార్లు వేలు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భీమవరం డిఎస్‌పి ఆర్.జి. జయసూర్యతో పవన్ కళ్యాణ్ నేరుగా తలపడటానికి పేకాట క్లబ్బు లే కారణమా ! మరెమైనా కారణాలు ఉన్నాయా ! పవన్ కళ్యాణ్, డిఎస్‌పి, జయసూర్య వివాదంపై ముఖ్యమంత్రి, హోం మంత్రి, డిజిపిపై ఒత్తిడి తీసుకురావటం వెనుక బలమైన కారణమే వుంది. పేకాట క్లబ్బులు కారణం కాకపోవచ్చును. ఏపి డిజిపి, హోమ్ మంత్రి తన శాఖ అధికారి డిఎస్‌పి జయసూర్యకు అండగా నిలుస్తారో..పవన్ కళ్యాణ్ రాజకీయ ఒత్తిడికి తలొగ్గుతారో వేచి చూడాలి. త్వరలో అనితమ్మ మంత్రి పదవికి పవన్ కళ్యాణ్ ఏమైనా ఎసరు పెట్టే ఆలోచనలు ఉన్నాయా ! ఉన్నట్టే పరిస్థితులు కనపడుతున్నాయి.

# చంద్రబాబుపాలనలో హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కరువు

## - మండిపడిన వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి - రాజమండ్రి గణేష్‌చౌక్ బాలికల వసతి గృహం విద్యార్థినిపై అత్యాచారం...
## - నిందితుడుపై ఫోక్సో కేసు నమోదు - బీసీ బాలికల హాస్టల్ వార్డెన్‌ను నిలదీసిన వైసీపీ మహిళా నేతలు

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలకు,సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థినులకు రక్షణ కరువని వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి విమర్శించారు. రాజమండ్రి గణేష్ చౌక్ బాలికల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని మూడు రోజుల క్రితం ఒక యువకుడు బయటకు తీసుకువెళ్ళి అత్యాచారం చేసిన సంఘటన నేపథ్యంలో బుధవారం జక్కంపూడి విజయలక్ష్మి, రుడా



మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గాండ్ల తెలకుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ,బీసీ నాయకురాలు బర్ల సీతారత్నం తదితరులు వసతి గృహాన్ని సందర్శించి వార్డెన్‌ను గట్టిగా నిలదీశారు. అపరిచితుల వెంట హాస్టల్ విద్యార్థినిని ఎలా బయటకు పంపించారని వారు వార్డన్ ను నిలదీశారు. రిజిస్టర్ లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం పట్ల వైసీపీ మహిళా నాయకులు వార్డన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.దీపావళి రోజున సాయంత్రం ఆ బాలిక తన అన్నయ్య వచ్చాడని వెళ్లిందని హాస్టల్ వార్డెన్ తెలిపింది.

# ఘనంగా శ్రీ గోవర్ధన పూజా మహోత్సవం



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో శ్రీ త్రిదండిస్వామి భక్తికంకణ బన మహారాజ్ ఆశీస్సులతో బుధవారం శ్రీ గోవర్ధనపూజా(అన్నకూట) మహోత్సవం వైభవంగా నిర్వహించినట్లు ఆశ్రమ ఇన్చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. ఉదయం గోపూజ, హరినామ సంకీర్తన,11 గంటలకు శ్రీమద్భాగవత ప్రవచనం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి హారతి,తీర్థప్రసాద వితరణ జరిగాయి. భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తిక దామోదర మాసం సందర్భంగా కృష్ణమాలాదీక్ష, హరిమాలాదీక్ష ధరించే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి కోరారు. నవంబరు 5వ తేదీ కార్తిక శుద్ధ పౌర్ణమి వరకు కార్తిక దామోదర వ్రతం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నగర సంకీర్తన, సాయంత్రం 6.30 గంటలకు ఆకాశదీప దర్శనం, అనంతరం సామూహిక భక్తులతో రాధా దామోదర స్వామివారికి దీపారాధన జరుగుతాయని ఆయన వివరించారు.

# డీఆర్ చెల్లింపుల్లో వాయిదాలు సరికాదు..

## అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు

ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఒక కిస్తీ కరువుభత్యం అక్టోబర్ నెల వేతనం నుండే నగదుగా పొందేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ అద్యక్షుడు యర్రమోతు ధర్మరాజు సంఘ సమావేశం లో ప్రభుత్వానికి కృతజ్ఞత లు తెలియజేశారు, అయితే గత ఇరవై ఒక్క నెలల బకాయిలు వచ్చే ఏడాది ఏప్రిల్ నుండి ఆపై ఏడాది (2027) ఫిబ్రవరి వరకు నాలుగు వాయిదాలుగా చెల్లిస్తాననడం విశ్రాంత ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోనికి తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని ధర్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికే మరో మూడు కిస్తీలు బకాయిలున్నాయి, ప్రస్తుత డీ ఆర్ చెల్లించే లోపు మరో మూడు విడతలు పేరుకు పోతాయి, చాలా మంది పండువటాకులు (విశ్రాంతి ఉద్యోగులు) రాలిపోతున్నాయి, ప్రభుత్వం అల్పాదాయ, అణగారిన వర్గాల సంక్షేమం కొరకు ఏటా వేలాదికోట్ల రూపాయలు వెచ్చిస్తోంది, ప్రజల కోసం ముప్పైఏళ్ళ పైబడి ప్రభుత్వ పథకాలను అమలుచేయుటలో నిరంతరం శ్రమించిన సంగతి ప్రభుత్వానికి తెలియనిదికాదు, ప్రజల సంక్షేమం మాదిరిగా విశ్రాంత ఉద్యోగులను పరిగణనలోనికి తీసుకోవాలి, వృద్ధాప్యంలో వైద్య, ఇతర ఖర్చులతో వచ్చే పెన్షన్ కు ఖర్చులకు పొంతన లేకుండా ఉంది, కావున పెన్షనర్ల కరువు బత్యం కిస్తీలను వాయిదాల పద్దతిలో కాకుండా నగదుగా చెల్లించాలని ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉర్రింకల సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐ.వి.సుబ్బారావు, నల్లి విజయమోహన్, విన్నకోట సాంబశివరావు, డిఎజెబి ప్రసాద్, బండారు రవీంద్ర,రంగారావు, కేశవరావు,అప్పారావు, సుబ్బారావు, సూర్యారావు, సత్యనారాయణ, బొమ్మా రాములు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో పిల్లల సంరక్షణపై నిర్లక్ష్యం వహించవద్దు..

## జిల్లా కలెక్టర్ హెచ్చరిక - హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి,జిల్లా వసతి గృహాలలో ఉండే పిల్లల విషయంలో అన్ని వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదు అని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహాల నుండి పిల్లలను పంపేముందు, పిల్లల సంరక్షణలో భద్రతను గరిష్టంగా నిబంధిస్తూ, బంధువుల వివరాలు, తగిన ఆధారాలు ముందుగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే వారితో పంపవలసినది అని స్పష్టం చేశారు. ఇటీవల నగరంలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో, హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘటనపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్తో సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతోందని కూడా వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో, వసతి గృహాల్లో నిర్లక్ష్యం గమనించబడక పోయినప్పటికీ, ఆడపిల్లలు, వసతి గృహాల్లో ఉండే పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఈ హెచ్చరికల ద్వారా, వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తత, జాగ్రత్త మరియు బాధ్యతా దృక్పథంతో విధులు నిర్వహించాలి అని ఆదేశించారు. ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యే విధంగా, పిల్లల భద్రతను మరింత బలపరచడం అని తెలిపారు.

# ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## వెంటిలేటర్‌పై ఉన్న వైద్య రంగాన్ని ఆదుకోవాలి.. - రూ 2.50 కోట్లు నిధులు వెంటనే విడుదల చేయాలి
## - ఈనెల 23న విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన




రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : తొమ్మిది నెలలుగా పెండింగ్లో ఉన్న ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఐఎంఏ, (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆశ (ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కే.విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ బకాయిలు తొమ్మిది నెలలు ఆగిపోయాయని అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లు అప్పులు చేసి పేద ప్రజలకు ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ 3 వేల కోట్లు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలకు ఇబ్బంది కలగకూడదని సదుద్దేశంతో ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లు వైద్య సేవలు కొనసాగిస్తున్నామని, గత పది రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేట్ హాస్పిటల్స్ లో నిలిపివేశామని వివరించారు. వెంటిలేటర్ పై ఉన్న వైద్య రంగాన్ని ఆదుకోవాలంటే రూ 6.70 వందల కోట్లు రూపాయలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పిడుగు విజయభాస్కర్ మాట్లాడుతూ కూడు, గూడు, ఆరోగ్యం ప్రజలకు అవసరమని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్ల ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి ఇల్లు, పొలాలు, బంగారు నగలు తాకట్లు పెట్టి హాస్పిటల్స్ నిర్వహణ చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవల కు రూ 3 వేల కోట్లు రూపాయలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ మనుగడ సాగించాలంటే వెంటనే రూ 6. 70 వందల కోట్లు రూపాయలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యరంగంపై నిర్లక్ష్యం వీడి ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీకి చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీ న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవల బకాయిల చెల్లించాలని కోరుతూ ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# జిఎంకే ట్రస్ట్, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ దాతృత్వం

♦ అగ్ని ప్రమాదంలో మరణించిన శెట్టి బలిజ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం
♦ శెట్టి బలిజ సంఘీయుల ఉమ్మడి కృషి 4లక్షల 25 వేల రూపాయలు అందజేత



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం గ్రామం శివారులో ఇటీవల బాణాసంచా తయారు చేస్తుండగా జరిగిన ఆకస్మిక విస్ఫోటనంలో మృతి చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ఐదు కుటుంబాలకు ఆపన్నహస్తం అందిస్తూ, అండగా మేమున్నామంటూ హైదరాబాద్ కు చెందిన జిఎంకే ట్రస్ట్ అధినేత గుత్తుల మీరా కుమార్, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ సంయుక్తంగా స్థానిక సంఘాల పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో ఆర్థిక సహాయాన్ని అందజేసారు. బాధితుల గృహాలకు స్వయంగా వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. తమ సంస్థ గుత్తుల మీరాకుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయగా, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్థాపించిన శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ మరొక లక్ష రూపాయలు, జిఎంకే ట్రస్ట్ పిలుపుతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్నటువంటి సామాజిక వర్గ సభ్యులు ఇచ్చిన విరాళాలు ఒక లక్ష ఇరవై వేల రూపాయలను బాణాసంచా ప్రమాదంలో మృతి చెందిన చిట్టూరి శ్యామల, చిట్టూరి యామిని, కుడుపూడి జ్యోతి, వాసంశెట్టి విజయలక్ష్మి, పెంకె శేషారత్నం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిఎంకే ట్రస్ట్ అధినేత గుత్తుల మీరా కుమార్ మాట్లాడుతూ బాణాసంచా కేంద్ర పేలుళ్ల ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చి దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. పారిశ్రామిక కార్మికులు అత్యంత జాగ్రత్తతో చేయవలసిన పనుల విషయములో కార్మికుల ప్రాణ భద్రత కొరకు యజమానులు మరింత మెరుగైన రక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. బాణాసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి పిల్లలకు భవిష్యత్తులో ఏదైనా అవసరం ఏర్పడితే, తమకు తెలియజేయాలని తమ పరిధిలో చేయగలిగినంత సహాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సహాయ కార్యక్రమానికి కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుమార్ తండ్రి వాసంశెట్టి సత్యం స్థాపించిన శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ కూడా తమతో చేతులు కలిపి పాల్గొనడం హర్షనీయ మని మీరాకుమార్ అన్నారు. ఎస్ఏ ఫ్ వాసంశెట్టి చిన్నబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్నివాలన్నారు. అంతకుముందు మృతుల ఆత్మ శాంతి కోసమని రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో జిఎంకే అధినేత మీరాకుమార్, ఎస్ఏఎఫ్ సభ్యులు చొల్లంగి వెంకటరమణ, జిఎంకే నిర్వాహకులు పిల్లి నాగబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, రాయుడు సతీష్, కడలి శేఖర్,పితాని మాచర్లరావు, మామిడిశెట్టి చిన్న,రామకృష్ణ, పితాని సత్తిపండు, నెంబర్ రాజు, గుత్తుల సాల్మన్ దొర, రాయవరం, సావరం, ఉభయగోదావరి జిల్లాల శెట్టిబలిజ సంగీయ గ్రామ పెద్దలు, మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.


# కూటమి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కంటి తుడుపుగానే ఉంది

### బాధితులకు ఎక్స్‌గ్రేషియా 25 లక్షలు ఇవ్వాలి : ఎమ్మెల్సీ తోట డిమాండ్




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరం గ్రామ శివారులో గణపతి ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కర్మాగారంలో జరిగిన భారీ విస్ఫోటనం ఘటనలో పదిమంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరణించిన బాధితుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం 15 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మునుపటి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించి, తక్షణమే చెల్లించేలా ఏర్పాట్లు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బాధితుల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఖండనీయమని అన్నారు. కొమరిపాలెం, రాయవరం గ్రామాల బాధితుల కుటుంబాల్లో పెద్దదిక్కు కోల్పోయిన పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని, పిల్లల విద్యార్హతలు బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం అందించేలా ఏర్పాట్లు చేయాలని తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. కనీసం 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఉంటే బాగుండేదని గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలకు 25 లక్షలు డిమాండ్ చేసి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఆ మాట మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు.ఈ ప్రమాదంపై ప్రభుత్వం మరింత సానుభూతితో వ్యవహరించాలని, బాధితులకు పూర్తి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# బాబూ లోకేష్ ఇద్దరూ లేకుండానే..!



ఏపీలో కూటమి ప్రభుత్వం సారధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల విదేశీ పర్యటనకు ఈ రాత్రి బయలుదేరి వెళ్తున్నారు. నవంబర్ లో విశాఖ వేదికగా రెండు రోజుల పాటు జరిగే పెట్టుబడుల సదస్సుని అత్యంత ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం తీసుకుంది. దాంతో ప్రపంచంలోని నలుమూలలూ చంద్రబాబు ఆయన కుమారుడు మంత్రి లోకేష్ పర్యటిస్తున్నారు. లోకేష్ మాటలో చెప్పాలంటే ఆకలితో ఏపీ ఉంది, పెట్టుబడుల వేట సాగిస్తోంది.

**లోకేష్ అక్కడ :**

ఈ క్రమంలో నారా లోకేష్ ఈ నెల 17 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఆయన పర్యటన వారం రోజుల పాటు సాగనుంది. తిరిగి లోకేష్ ఈ నెల 25 నాటికి కానీ ఏపీకి చేరుకోరని అధికార వర్గాలు తెలిపాయి. ఇక లోకేష్ సిడ్నీలో రోడ్ షోలో పాల్గొన్నారు పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఏపీ మీద పూర్తి ఆశావహ వాతావరణాన్ని కల్పిస్తున్నారు. లోకేష్ ఆస్ట్రేలియాలో మరిన్ని సదస్సులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బాబు సైతం : ఇక విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి విదేశీ పర్యటనను చేపట్టారు. ఈసారి ఆయన దుబాయ్, అబుదాబీ, యూఏఈలో పర్యటిస్తారని తెలుస్తోంది. ఆయన ఈ ప్రాంతాలలో పారిశ్రామికవేత్తలను కలసి ఏపీకి పెట్టుబడులు పెట్టడం గురించి సోదహరణంగా వివరిస్తారని అంటున్నారు. అంతే కాకుండా ఏపీ ఏ విధంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది అన్నది తెలియచేస్తారు. ఏపీలో ఉన్న అవకాశాలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఇండస్ట్రీస్ ఫ్రెండ్లీ ఎన్విరాన్ మెంట్ వంటివి కూడా ఆయన తెలియచేస్తారని అంటున్నారు.

**ఈ రంగాలే టార్గెట్ :** ఏపీలో కీలకమైన నిర్మాణ రంగం అలాగే రియల్ ఎస్టేట్ రంగం, లాజిస్టిక్స్, రవాణా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్నోవేషన్ ఫీల్డ్ ఇలా ఈ రంగాలను ఎంచుకుని వీటిలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను బాబు ఏపీకి ఆహ్వానించనున్నారని అంటున్నారు. ఈ సందర్భంగా దిగ్గజ సంస్థలతో పాటు అనేక మంది పారిశ్రామికవేత్తలతో బాబు సమావేశం అవుతారని అంటున్నారు. రానున్న రోజులలో ఈ రంగాలలో విశేషంగా పెట్టుబడులు తీసుకుని వస్తే ఏపీ ప్రగతి గతి మారుతుందని బాబు ఆశిస్తున్నారు. అందువల్ల ముఖ్యమంత్రి పర్యటన కీలకంగా మారింది. సీఎం వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, అలాగే పలు కీలక శాఖలకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఈ విదేశీ పర్యటనకు వెళ్తోంది.

**స్టీరింగ్ అక్కడ నుంచే :** ఏపీ సీఎంగా చంద్రబాబు మూడు రోజుల పాటు విదేశీ పర్యటనలో ఉంటారు. ఆయన రాష్ట్రంలో ఉండరు. అదే విధంగా మంత్రి నారా లోకేష్ కూడా ఏపీలో ఉండరు. మరి పాలన ఎలా అంటే సీఎం ఎక్కడ నుంచి అయినా పాలిస్తారు. టెక్నాలజీ మీద పూర్తి పట్టు ఉన్న చంద్రబాబు విదేశాలలో ఉన్నా ఎప్పటికప్పుడు అప్డేట్స్ ని తీసుకుంటూ అక్కడ నుంచే పాలన కొనసాగిస్తారు అని అంటున్నారు. గతంలో అయితే సీఎంలు విదేశాలకు వెళ్తే ఇతర సీనియర్ మంత్రులకు బాధ్యతలు అప్పగించేవారు. కానీ గడచిన కొన్నేళ్ళలో టెక్నాలజీ వచ్చి అన్ని మార్చేసింది. దాంతో ఎవరు ఎక్కడ ఉన్నా ఎంత దూరం ఉన్నా పాలన సులువుగానే సాగిపోతోంది. సో బాబు కానీ లోకేష్ కానీ దేశంలో లేకపోయినా స్టీరింగ్ మాత్రం బాబు వద్దనే ఉంటుంది అని అంటున్నారు. అదన్న మాట మ్యాటర్.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను ఆపే వరకు నిరసన

### కోటి సంతకాలతో ప్రచారం విస్తృతం




**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెం, సామంతకుర్రు గ్రామాలలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా బుధవారం రచ్చబండ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషారావు,కొనుకు బాపూజీ మాట్లాడుతూ రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను ఆపేవరకు కోటి సంతకాల సేకరణ చేపడుతూ గ్రామ గ్రామాన, పల్లె పల్లెల్లో నిరసన కార్యక్రమం చేపతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జె సి ఎస్ అధ్యక్షులు తిక్క ప్రసాద్ , వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, ఎస్ పల్లిపాలెం సర్పంచ్ కొల్లు వెంకట రమణ నాగేశ్వరరావు , గ్రామ ప్రధాన కార్యదర్శి పశ్చిమాల లీలా ప్రసాద్, ఎంపీటీసీ కర్రి శ్రీను యువజన విభాగం అధ్యక్షులు బల్ల శ్యామ్, మధుర శేఖర్, కొప్పాడి వీరాంజనేయులు, ఈతకోట సతీష్, మాకే దొరబాబు, ఓగురీ సత్యనారాయణ, తిరుకోటి క్రిష్ణ, బొంతు నాగరాజు, గంటా శ్రీనివాసరావు, బొంతు ఏడుకొండలు, పశ్చిమాల శ్రీనివాసరావు, కొనుకు బాబురావు, జాన్, తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ కొత్తపేటలో త్వరలో ప్రారంభం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం 5 రూపాయలకే అన్నార్తుల ఆకలిను తీర్చే అన్న క్యాంటీన్ అన్నార్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ప్రధాన పట్టణ కేంద్రాలలో ప్రారంభించారు. నియోజవర్గాల వారీగా అంచలంచలుగా విస్తరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ ఆనాడు తెలియజేశారు. అన్న క్యాంటీన్ అవసరాన్ని గుర్తించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవ తీసుకుని కొత్తపేటలో ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు.స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరుకు కృషి చేశారు. దాని ఫలితంగా కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం కాబోతోంది.ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు.పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాల్సిందిగా ఆదేశాలిచ్చారు.కొత్తపేటలో ముఖ్య కూడలిలో అన్న క్యాంటీన్ నిర్మించడం వలన విశేష ఆదరణ కలుగుతుందని పేర్కొనవచ్చు. ఇటు ప్రభుత్వ ఆసుపత్రికి సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు పూర్వపు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరగా రైతు బజార్ పక్కన బస్టాండ్ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్ నిర్మిస్తున్నారు. అందరికీ అందుబాటులో నిర్మించడం అన్నార్తులకు ఎంతో ప్రయోజనకరం కానుంది.చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ పనులపై మండల కేంద్రం కొత్తపేట వచ్చే ప్రజలకు భోజన సమయంలో ఆకలి తీర్చే అక్షయ పాత్ర గా నిలుస్తుందని హర్షిస్తూ మంచి స్థలాన్ని ఎన్నుకుని అన్న క్యాంటీన్ నిర్మిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ను మరియు కూటమి ప్రభుత్వాన్ని కొత్తపేట నియోజకవర్గ ప్రజానీకం ప్రసంశిస్తున్నారు.అన్ని పనులు పూర్తిచేసి త్వరలో ఈ అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు.

# జాతీయ కో-ఆర్డినేటర్‌గా జంగా గౌతమ్



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం జాతీయ కోఆర్డినేటర్‌గా జంగా గౌతమ్‌ని నియమించినట్లు అంబాజీపేట మండల కాంగ్రెస్ నాయకులు పత్రిక ప్రకటనలో తెలిపారు. గౌతమ్ కాంగ్రెస్ పార్టీ కోసం పూర్తి సమయాన్ని కేటాయించి కష్టపడే వ్యక్తిత్వం, చురుకుతనం, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి జంగా గౌతమ్ అని నాయకులు తెలిపారు. మన ప్రాంతవాసి భారత దేశ రాజకీయాలలోకి అడుగు పెట్టడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. ఈ నియామకానికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, సోనియా గాంధి, రాహుల్ గాంధిలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇస్మాయల్ ఆరిఫ్, పిసిసి మెంబర్ మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెల్లి వెంకటరమణ, మూలపర్తి మోహనరావు, అదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ ఇస్మాయల్ జంగా గౌతమ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్‌కు అభినందనలు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ని రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం కార్యదర్శిగా నియమిస్తూ ఇటీవల వైసిపి పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం మండపేట వైసిపి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, పిఏసి కమిటి మెంబర్, ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైసిపి ఇంచార్జి తోట త్రిమూర్తులును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం త్రిమూర్తులు సుధాకర్‌ని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతతో పార్టీ విజయానికి కృషిచేస్తూ పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో తనవంతు కృషి చేస్తానన్నారు. తనను నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక పాలనపై అలుపెరగని పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. సుధాకర్ నియామకం పట్ల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరావు, ఎంపీటీసీలు పట్నాల నాగబాబు, వైసిపి పార్టీ మండల అధ్యక్షులు అడబాల బాబ్జి, సీనియర్ నాయకులు కుడిపూడి రాంబాబు, తాతపూడి రాజేష్, పిల్ల వీరబాబు, ఆరవ రాజు, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్య భాస్కరరావు, పితాని నారాయణరావు, వాసిరెడ్డి అర్జున్, కోళ్ల శ్రీను, పోతుల ప్రసాద్, విసిపురెడ్డి శివ, చిలుకూరు బుజ్జి, పైడిమల్ల రాజు, పల్లేటి వినోద్ కుమార్, వార్డు మెంబర్లు కొండేటి కాళీకృష్ణ, పంపన పద్మారావు, ముగ్గుల పార్థసారథి, బండారు కృష్ణ పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆదాయం

# రికార్డ్ స్థాయిలో ముదునూరి వెంకటరాజు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి నొంది భక్తుల కోరికలు తీర్చే ఏడు ప్రదక్షిణలుతో దేశవ్యాప్తంగా అందరి మనసులను దోచుకున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం గత రికార్డులను బద్దలు కొడుతూ ముదునూరి వెంకటరాజు గబ్బర్ సింగ్ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా ఈరోజు ఒక కోటి ఏనబదీఏడు లక్షల ముప్పదిఆరు వేల రూపాయలు చేరుకున్న సందర్భంగా స్వామి భక్తులకు శుభాభినందనలు తెలియజేశారు.

## మా భద్రత మేం చూసుకుంటాం..

# ఇజ్రాయెల్ అమెరికా రక్షిత ప్రాంతం కాదు

ఇజ్రాయెల్ తన భద్రతను తానే చూసుకుంటుందని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. తమ దేశం అమెరికా రక్షిత ప్రాంతం కాదని స్పష్టం చేశారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందం పురోగతిపై చర్చించేందుకు బుధవారం ఆయన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో భేటీ అయ్యారు. అంతకుముందు ఈమేరకు మాట్లాడారు. గాజాలో అంతర్జాతీయ దళాలను మోహరిస్తే.. భవిష్యత్తులో ఆ ప్రాంతం నుంచి ఎదురయ్యే ముప్పును తిప్పికొట్టేందుకు ఇజ్రాయెల్‌కు పరిమిత అవకాశాలే లభిస్తాయన్న ఆందోళనల నడుమ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న జేడీ వాన్స్ సైతం నెతన్యాహుతో సమావేశం ప్రారంభానికి ముందు విలేకరులతో మాట్లాడారు. శాంతి మార్గంలో అనేక అడ్డంకులు ఉన్నాయని తెలిపారు. "మా ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. హమాస్‌ను నిరాయుధీకరణ చేయడం, ఆ సంస్థ ఇకపై ఇజ్రాయెల్ కు ముప్పు కాదని నిర్ధరించడం, గాజాను పునర్నిర్మించడం వంటి పనులు చేయాల్సి ఉంది. ఇవన్నీ అంత సులభం కాదు. కానీ.. ఆశావహ దృక్పథంతో ఉన్నాం" అని పేర్కొన్నారు. హమాస్, ఇజ్రాయెల్‌ల మధ్య కాల్పుల విరమణ తాను ఊహించిన దానికన్నా మెరుగ్గా సాగుతోందని అంతకుముందు ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. గాజాలో మానవతా సాయం అందించేందుకు ఐరాస ఏజెన్సీ 'యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ'ను అనుమతించాలని



ఇజ్రాయెల్‌ను 'ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్' సూచించింది. హమాస్‌కు సాయం అందిస్తోందనే కారణంతో పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐరాస సంస్థ ను ఇజ్రాయెల్ నిషేధించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఐరాస జనరల్ అసెంబ్లీ గత ఏడాది ఐసీజేను ఆశ్రయించింది. ఈ క్రమంలోనే యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ సహా ఐరాస, దాని సంస్థలు అందించే సహాయ కార్యక్రమాలను అనుమతించాలని ఐసీజే అధ్యక్షురాలు యుజీ ఇవాసవా ఆదేశించారు.

# రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు

పథనంథిట్ట

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం ముర్ము తిరువనంతపురం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆమె శబరిమల బయల్దేరారు. ప్రమదంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రపతి హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా.. హెలిప్యాడ్‌లోని కాంక్రీట్ ఒక్కసారిగా కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం ఒకటి లోపలికి దిగిపోయింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా హెలికాప్టర్ నుంచి కిందకు దించారు. ఈ ఘటనలో రాష్ట్రపతికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పంబకు బయల్దేరారు. హెలికాప్టర్ చక్రాన్ని బయటకు తీసేందుకు పలువురు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాన్ని తోస్తున్న చిత్రాలు పలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. వాస్తవానికి రాష్ట్రపతి హెలికాప్టర్ పంబ సమీపంలోని నీలక్కల్ వద్ద దిగాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ స్థలాన్ని ప్రమదం ప్రాంతానికి మార్చారు. "ప్రమదం ప్రాంతంలో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయాలని చివరి నిమిషంలో నిర్ణయించారు. అందువల్ల మంగళవారం రాత్రే ఇక్కడ హెలిప్యాడ్‌ను నిర్మించారు. దీంతో కాంక్రీట్ పూర్తిగా గట్టిపడలేదు. బుధవారం ఉదయం హెలికాప్టర్ దిగిన తర్వాత ఆ బరువును మోయలేక అది కుంగిపోయింది. చక్రం ఒకటి కాంక్రీట్‌లో ఇరుక్కుపోయింది" అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

**పూర్తిగా భద్రతా వైఫల్యమే**

రాష్ట్రపతి ముర్ము హెలికాప్టర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పడంపై కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ తీవ్రంగా




స్పందించారు. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి భద్రత విషయంలో కేరళ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందనేదానికి ఇదే నిదర్శనమన్నారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తు జరపాలన్నారు. అయ్యప్ప దయ వల్ల రాష్ట్రపతికి ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

**ఇరుముడితో శబరిమలకు ముర్ము**

రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక కాన్వాయ్‌లో ఉదయం 11 గంటలకు పంబ చేరుకున్నారు. అక్కడి నదిలో కాళ్లు కడుక్కున్న ఆమె.. గణపతి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి విష్ణు నంబూద్రి ముర్ముకు ఇరుముడి కట్టారు. భద్రతాధికారులు సౌరభ్ నాయర్, వినయ్ మాథుర్‌లతో పాటు ముర్ము అల్లుడు గణేశ్‌చంద్ర హెూంబ్రమ్‌కు కూడా ఇరుముడు కట్టారు. నల్ల చీరతో తలపై ఇరుముడి పెట్టుకొని రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్నారు. పవిత్రమైన 18 బంగారు మెట్లు ఎక్కారు. అయ్యప్ప స్వామిని దర్శించుకొని, ఇరుముడి సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న తొలి మహిళా రాష్ట్రపతిగా నిలిచారు. అంతకుముందు 1970ల్లో అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. ఆయన డోలీలో సన్నిధానానికి చేరుకున్నారు. తాజాగా ముర్ము ఫోర్ వీల్ డ్రైవ్ వాహనంలో సన్నిధానానికి వెళ్లారు.

# హెయిర్ స్టైల్‌నే కాదు.. చరిత్రనే మార్చేసింది

జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి చరిత్ర సృష్టించారు. రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో... 'అచ్చం మార్గరెట్ థాచర్ హెయిర్ స్టైయిల్‌లా ఉండాలి' అని తన హెయిర్ స్టయిల్ మార్చారు. అయితే ఆమె మార్చింది కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు... పితృస్వామ్య ఆధిపత్యంతో కూడిన ఎన్నో స్థిర అభిప్రాయాలను! తకాయిచి సుపరిచిత రాజకీయ జీవితం మాట ఎలా ఉన్నా, అదర్‌సైడ్ బహుముఖ ప్రజ్ఞావంతురాలు. సింగర్, డ్రమ్మర్, బైక్ రైడర్, కరాటే ఫైటర్, టీవీ ప్రెజెంటర్... ఒకటా రెండా! సనే తకాయిచికి మెటాలిక, ఐరన్ మెయిడెన్, బ్లాక్ సబ్బాత్ లాంటి హెవీ మెటల్ మ్యూజిక్ బ్యాండ్‌లు అంటే చాలా ఇష్టం. బిగ్గరగా, దూకుడుగా ధ్వనించే రాక్ స్టైల్ హెవీ మెటల్ బ్యాండ్‌ల సొంతం. సంగీత అభిమానిగా ఉన్న తకాయిచి కాలేజీ బ్యాండ్‌లో డ్రమ్ వాయించేవారు. ఆమె బ్యాండ్ వాయించడం ఎంత ఉధృతంగా ఉండేది అంటే కర్రలు తప్పనిసరిగా విరిగిపోయేవి! అందుకే బ్యాకప్‌గా నాలుగు జతల కర్రలను తీసుకువెళ్లేవారు. స్కూల్ రోజుల్లో గిటార్ వాయించేవారు.

వయసుతో పాటు ఉత్సాహం పెరుగుతూనే ఉంది..! కళలపై ఎంత పాషన్ ఉన్నా సరే వయసుతోపాటు కొందరిలో ఉత్సాహం తగ్గిపోతుంది. అయితే తకాయిచి అలా కాదు. ఇప్పటికీ ఇంట్లో డ్రమ్స్ వాయిస్తారు. రాజకీయాలు అన్నాక ఒత్తిడి సహజం కదా! ఎప్పుడైనా మరీ ఒత్తిడికి గురైనప్పుడు డ్రమ్స్ వాయించే సమయం రెట్టింపు అవుతుంది.

**రాజకీయ నేపథ్యం లేదు... ధైర్యం మాత్రమే ఉంది...**

జపాన్‌లోని పితృస్వామ్య రాజకీయ వ్యవస్థలో తకాయిచి ప్రధానిగా ఎన్నికకావడం అనేది ఆశ్చర్యకరమైన, అరుదైన విజయం. ఆమె దేశభక్తి విద్యను ప్రోత్సహిస్తున్నారు. యుద్ధాలను త్యజించే విధానాలకు మద్దతు ఇచ్చారు. తన రాజకీయ సహచరులలో చాలామందిలా ఆమెకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. తండ్రి ఒక కార్ల కంపెనీలో పనిచేసేవాడు. తల్లి పోలీస్ ఆఫీసర్. రాజకీయాల్లోకి రాక ముందు తకాయిచి టీవి కామెంటేటర్‌గా పనిచేసేవారు. నవ్వుతూ, నవ్విస్తూ ఇంటర్వ్యూలు, టీవి కార్యక్రమాలు చేసేవారు. జపాన్ పార్లమెంట్‌లో మొదటిసారి అడుగు పెట్టిన కాలంలో తన జుట్టు స్టైల్ మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు 'అచ్చం మార్గరెట్ థాచర్ హెయిర్ స్టైల్‌లా ఉండాలి' అని హెయిర్ డ్రెస్సర్‌కు చెప్పారు. మార్గరెట్ థాచర్‌కు ఆమె వీరాభిమాని... ' గుంపు వెంట పరుగెత్తడం కాదు... ఆ సమూహం నిన్ను అనుసరించేలా చేసుకోవాలి'... ఇలా థాచర్ ప్రసిద్ధ మాటలు ఎన్నో తకాయిచి నోట వినిపించేవి.

**బైక్ రైడింగ్‌కు గుడ్‌బై...**

బైక్ రైడింగ్ అంటే తకాయిచికి బోలెడు ఇష్టం. సమయం చిక్కేది కాదా? భద్రతా కారణాలా? తెలియదుగానీ 32 సంవత్సరాల వయసులో పార్లమెంట్‌లోకి అడుగు పెట్టిన తకాయిచి తనకు అత్యంత ప్రియమైన కవాసకి జెడ్400జీపి మోటర్ సైకిల్‌కు గుడ్‌బై చెప్పారు. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపి)లో తనదైన ప్రత్యేకత నిలుపుకున్న తకాయిచి ఎన్నో క్యాబినెట్ ర్యాంక్ పదవుల్లో రాణించారు. పార్టీ పాలసీ రిసెర్చ్ కౌన్సిల్‌కు అధ్యక్షురాలిగా పనిచేశారు.

**భవిష్యత్ ఏమిటి?**

'ప్రధానిగా తకాయిచి ఎన్నిక పార్టీకి అదృష్టాన్ని తెస్తుందా? పార్టీని పునర్జీవింపజేస్తుందా? లేక పార్టీ క్షీణతను వేగవంతం చేస్తుందా?' అంటూ విశ్లేషణలు చేస్తున్నారు రాజకీయ పండితులు. మహిళలకు సంబంధించి ఆమెకు ఉన్న అభిప్రాయాలు కొన్ని వివాదాస్పదం అయ్యాయి. అయితే ఎన్నికల ప్రచారంలో బేబీ సిట్టింగ్ కోసం పన్ను మినహాయింపులు, పిల్లల సంరక్షణ కోసం కార్పొరేట్ ప్రోత్సాహకాలను ప్రతిపాదించడం అనేది మహిళా%-%స్నేహపూర్వక విధానాల వైపు తకాయిచి అడుగులు వేస్తున్నారు అని చెప్పడానికి సంకేతం.

ఒక లవ్ స్టోరీ... లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)లో తన రాజకీయ సహచరుడు యమమోటోను తకాయిచి వివాహం చేసుకున్నారు. అతడు ఆమెను ఎంతోకాలంగా మౌనంగా ప్రేమిస్తున్నాడు. ఇట్టి విషయాన్ని ఆమె గమనించక పోలేదు. ఒకానొక రోజు ఆయన ఫోన్ చేసి లవ్ ప్రపోజ్ చేశారు. ఆమె ఒప్పుకున్నారు. పెళ్లి జరిగింది. 'మీకు లవ్ యూ చెప్పాలంటే ఎంతో ధైర్యం కావాలి. మీరు అంత త్వరగా ఎలా ఒప్పుకున్నారు?' అనే ప్రశ్నకు తకాయిచి ఇలా జోక్ చేశారు... 'నిజం చెప్పమంటారా! నేను భోజనప్రియురాలిని. మంచి రుచికరమైన భోజనం చేయకుండా ఒక్కరోజు కూడా ఉండలేను. యమమోటోని పెళ్లి చేసుకుంటే మంచి భోజనానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు అనే ధైర్యంతో ఒప్పుకున్నాను. ఎందుకంటే ఆయన ట్రైన్‌డ్ చెఫ్!' రాజకీయా అభిప్రాయాలలో తేడా కారణంగా విడిపోయిన ఈ దంపతులు 2021లో తిరిగి వివాహం చేసుకున్నారు.

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ



కృత్రిమమేధ (ఏఐ) సహాయంతో తప్పుడు సమాచారాన్ని, డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలను రూపొందించి జనాల్ని మోసగిస్తున్న ఘటనలు పెరిగిపోతున్న దృష్ట్యా.. వాటి కట్టడికి కేంద్రం నడుంబిగించింది. ఈ మేరకు ఐటీ నిబంధనల చట్టం, 2021కి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ బుధవారం ముసాయిదాను విడుదల చేసింది. ఏఐ ద్వారా సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వంటివి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజలను మోసగిస్తున్నాయని, వ్యక్తులను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయని, ఆర్థిక మోసాలకు కారణమవుతున్నాయని, ఎన్నికలను కూడా ప్రభావితం చేస్తున్నాయని ఐటీ శాఖ ఈ సందర్భంగా వెల్లడించింది. దీనిని నివారించటం కోసం ముసాయిదా ప్రతిపాదనలు తయారుచేశామని తెలిపింది. కనీసం 50లక్షల ఖాతాదారులున్న సోషల్ మీడియా సంస్థలు, ఇతర ప్లాట్‌ఫామ్స్‌కు ఈ నియంత్రణలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం.. నిజమైన సమాచారంలాగే భ్రమింపజేసేలా అల్గారిథమ్ ఆధారంగా, కంప్యూటర్ ద్వారా తయారుచేసే కంటెంట్‌ను 'సింథటికల్లీ జెనరేటెడ్ కంటెంట్' (కృత్రిమంగా సృష్టించిన అంశాలు)గా పిలుస్తారు. ఈ తరహా కంటెంట్‌ను అప్‌లోడ్ చేసే వ్యక్తుల నుంచి ఇది కృత్రిమ కంటెంట్ అనే అంగీకారపత్రాన్ని సోషల్ మీడియా సంస్థలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఈ ఫేక్ ఆడియో, వీడియో సమాచారాన్ని వినియోగదారులు గుర్తించి జాగ్రత్తపడేలా.. వాటి మీద 'ఇది కృత్రిమ కంటెంట్' అనే హెచ్చరిక కనిపించాలి/వినిపించాలి. వీడియోకైతే.. అది కనిపించే తెర మీద 10 శాతం స్థలంలో ఈ హెచ్చరిక ఉండాలి. ఆడియో అయితే మొత్తం వ్యవధిలో తొలి 10 శాతం వ్యవధి మేర హెచ్చరిక వినిపిస్తూ ఉండాలి. కృత్రిమ కంటెంట్‌ను గుర్తించి, దానిపై నిర్దేశితస్థాయిలో హెచ్చరిక లేబుల్ ఉండేలా సోషల్ మీడియా సంస్థలు సాంకేతికపరంగా చర్యలు తీసుకోవాలి. ఈ ముసాయిదా ప్రతిపాదనలపై అభిప్రాయాల్ని, సూచనల్ని నవంబరు 6వ తేదీ వరకూ తమకు పంపించవచ్చని ఐటీ శాఖ ప్రజలకు పిలుపునిచ్చింది. కాగా, సైబర్‌మోసాల నుంచి వినియోగదారుల్ని రక్షించటానికి కొత్త యాంటీ స్కామ్ ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు మెటా ప్రకటించింది.

## భారత సైన్యంలో 'భైరవ్'



భారత సైన్యంలో ఆధునిక పరిజ్ఞానం, శక్తిమంతమైన ఆయుధాలతో శరవేగంగా స్పందించే 'భైరవ్' బెటాలియన్‌లు సిద్ధమవుతున్నాయి. నవంబర్ 1న తొలి బెటాలియన్ సైన్యంలో మోహరించనున్నట్లు భారత సైన్యం (పదాతిదళ) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ అజయ్ కుమార్ వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో ఇటువంటి 25 బెటాలియన్లను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో భైరవ్ యూనిట్‌లో 250 మంది సుశిక్షిత జవాన్లు ఉండనున్నట్లు చెప్పారు. "ఇప్పటికే ఐదు భైరవ్ బెటాలియన్లు ఏర్పాటయ్యాయి. వీటిని నిర్దేశించిన ప్రాంతాల్లో మోహరించారు. అక్టోబర్ 1 నుంచి శిక్షణ కొనసాగుతోంది. నెల చివరి నాటికి పూర్తవనుండగా.. తొలి బెటాలియన్ పూర్తి స్థాయిలో పనిచేస్తుంది. మరో నాలుగు బెటాలియన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రానున్న ఆరు నెలల్లో ఇటువంటివి 25 బెటాలియన్లను ఏర్పాటు కానున్నాయి" అని డైరెక్టర్ జనరల్ అజయ్ కుమార్ వెల్లడించారు. భారత సైన్యంలోని ప్రత్యేక బలగాలకు, సంప్రదాయ పదాతిదళాల మధ్య ఉన్న అంతరాన్ని ఇవి భర్తీ చేస్తాయని సైనికాధికారులు చెబుతున్నారు. ఈ భైరవ్ యూనిట్‌లో 250 మంది సుశిక్షిత జవాన్లు, ఏడు నుంచి ఎనిమిది మంది అధికారులు ఉండనున్నారు. సంఖ్యాపరంగా చిన్నగా ఉన్నప్పటికీ చాలా శక్తిమంతమనే చెప్పవచ్చు. సాధారణ పదాతిదళ బెటాలియన్లు చేపట్టలేని, ప్రత్యేక బలగాల అవసరం లేని ఆపరేషన్లను భైరవ్ యూనిట్లు చేపడతాయి. రిస్కు అధికంగా ఉన్న, శత్రు భూభాగంలోకి రహస్యంగా లోతుగా చొచ్చుకెళ్లాల్సిన ఆపరేషన్లపైనే దృష్టిసారించేందుకు వీలవుతుంది

## అమెజాన్‌లో రోబోలు



న్యూఢిల్లీ

ప్రముఖ దిగ్గజ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్.. తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. రోబోల ద్వారా ఆ స్థానాలను భర్తీ చేసుకోవాలని యోచిస్తోంది. 2033 నాటికి 6లక్షల మంది దాకా ఉద్యోగులను తగ్గించుకొని.. రోబోలతో ఆ పనులు చేయించే ఆలోచనలో ఉంది. ఇందుకు సంబంధించి అమెజాన్‌కు చెందిన కీలక సమాచారంతో కూడిన పత్రాలు లీకైనట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఇప్పటికే వేర్‌హౌసలలో భారీగా రోబోలను వినియోగిస్తున్న అమెజాన్.. రానున్న రోజుల్లో వాటిని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపింది. 75 శాతం పనులను ఆటోమేషన్ చేసేందుకు రోబోటిక్స్ బృందం పనిచేస్తోందని పేర్కొంది. అయితే దీనిపై అమెజాన్ సూటిగా స్పందించలేదు. లీకైన పత్రాలు పూర్తిగా సంస్థ ప్రణాళికను వెల్లడించేవి కావని అమెజాన్ అధికార ప్రతినిధి కెల్లీ నాంటెల్ అన్నారు. సంస్థలోని ఒక బృందం అభిప్రాయాలనే తెలియజేస్తాయని పేర్కొన్నారు. రానున్న హాలిడే సీజన్‌లో 2.5 లక్షల మంది ఉద్యోగులను నియమించుకునే ప్రణాళికను వెల్లడించినట్లు తెలిపారు.

# బిజినెస్

## టెక్ దిగ్గజం అమెజాన్ కీలక నిర్ణయం




ప్రస్తుతం టెక్ ప్రపంచాన్ని ఏఐ శాసిస్తున్న సంగతి తెలిసిందే. ఏ పనిచేసేందుకు అయినా ఏఐని వినియోగిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని పనులకు ఏఐ ఆధారంగా పనిచేసే రోబోటిక్స్ వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పటికే లక్షల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేసేసింది. ఇక టెక్ దిగ్గజం అమెజాన్ తమ కంపెనీలో ఏకంగా 6లక్షల కార్మిక ఉద్యోగాల్లో రోబోటిక్స్‌నే నియమించుకోవాలని నిర్ణయం తీసుకుందట. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం, అమెజాన్ 2033 నాటికి అమెరికాలో 6లక్షల కంటే ఎక్కువ ఉద్యోగాలను రోబోలతోనే భర్తీ చేయాలని ఆలోచిస్తుంది. తమ కంపెనీ కార్యకలాపాల్లో 75శాతం ఉద్యోగాలను 2027 నాటికి ఆటోమేషన్ ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయం తీసుకుంది. అమెజాన్ గోదాంలు, షిప్పింగ్ కేంద్రాలలో రోబోలను తీసుకురావడం ద్వారా 2025 నుండి 2027 వరకు దాదాపు 12.6 బిలియన్లను ఆదా చేసుకోవచ్చని భావిస్తోంది. ఇప్పటికే అమెజాన్‌లో భారీగా లే ఆఫ్స్ జరిగిన సంగతి తెలిసిందే. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంతో భవిష్యత్‌లో భారీగా ఉద్యోగాల కోత తప్పదని నిపుణులు చెబుతున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన ముహురత్ ట్రేడింగ్



దీపావళి పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లలో మంగళవారం జరిగిన ప్రత్యేక సెషన్ 'ముహురత్ ట్రేడింగ్' ఫ్లాట్‌గా సాగింది. దీంతో కొత్త సంవత్-2082 సానుకూలంగా ప్రారంభమైందని చెప్పవచ్చు.దీపావళి పండుగకు ఏదైనా పని మొదలుపెడితే విజయం దక్కుతుందని పెట్టుబడిదారులు నమ్ముతారు. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే, వచ్చే ఏడాది దీపావళి కల్లా లాభాల పంట పండుతుందని విశ్వసిస్తారు. ఈ కారణంగానే చాలామంది ట్రేడర్లు, ఇన్వెస్టర్లు ముహురత్ ట్రేడింగ్‌లో పాల్గొంటారు. గంటపాటు జరిగిన ఈ ట్రేడింగ్‌లో భారీ ర్యాలీ లేకపోయినప్పటికీ, సూచీలు స్వల్ప లాభాలను సాధించాయి. దీంతో సెన్సెక్స్ 62 పాయింట్లు పెరిగి 84,426 వద్ద, నిఫ్టీ 25 పాయింట్లు లాభపడి 25,868 వద్ద ముగిశాయి. ట్రేడర్స్, ఇన్వెస్టర్స్ కొత్త అకౌంట్ ఏడాది ప్రారంభానికి గుర్తుగా మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలైన ముహురత్ ట్రేడింగ్‌లో మొదట సెన్సెక్స్ 270 పాయింట్ల కంటే ఎక్కువగా ర్యాలీ చేసింది. నిఫ్టీ కూడా 25,900కి పైగా ఎగసింది. అయితే, కొద్దిసేపటి తర్వాత మార్కెట్లలో జోరు తగ్గింది. ఆఖర్లో ఒత్తిడి కారణంగా లాభాలు తగ్గాయి. కీలక బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, టాటా మోటార్స్ వంటి స్టాక్ రాణించాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు బలహీనపడ్డాయి. కాగా, దీపావళి బలిప్రతిపద కారణంగా బుధవారం స్టాక్ మార్కెట్లు పనిచేయవు. తిరిగి గురువారమే మార్కెట్లు తెరుచుకుంటాయి.

# టాటా మోటార్స్ దూకుడు

## లక్షకుపైగా డెలివరీలతో సరికొత్త రికార్డు..!




భారత్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ సరికొత్త రికార్డును సృష్టించింది. దాదాపు నెల రోజుల్లోనే లక్షకుపైగా కార్లను డెలివరీ చేసింది.నవరాత్రుల నుంచి దీపావళి మధ్యకాలంలో కంపెనీ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి అమ్మకాలు 33శాతం వరకు పెరిగాయని టాటా మోటార్స్ చెప్పింది. జీఎస్టీ తగ్గింపుతో పాటు పండుగ సమయంలో డిమాండ్ కారణంగా అమ్మకాలు భారీగా పెరిగాయి. కంపెనీ యూఎస్‌వీ మోడల్స్‌కు ఫుల్ డిమాండ్ కనిపించింది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర మాట్లాడారు. నవరాత్రుల నుంచి దీపావళి మధ్య నెల రోజుల్లో లక్షకుపైగా వాహనాల డెలివరీలతో చారిత్రక మైల్‌స్టోన్ చేరామన్నారు. ఎస్‌యూవీలు ఈ వృద్ధిని ముందుకు నడిపించాయన్నారు. కంపెనీ విక్రయించిన వాహనాల్లో అత్యధికంగా నెక్సాన్ మోడల్‌ను డిలివరీ చేసింది. 38వేల యూనిట్లతో 73శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే, టాటా పంచ్ 32వేల యూనిట్లతో 29శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పింది. ఎస్‌యూవీలతో పాటు ఈవీ విభాగంలోనూ భారీగానే డెలివరీలు చేసింది. నెల రోజుల పండుగ సీజన్ సమయంలో దాదాపు 10వేలకుపైగా ఈవీ కార్లను డెలివరీ చేసినట్లు చెప్పింది. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 37శాతం పెరిగాయని.. ఈ విజయంతో మిగతా కాలంలోనూ మంచి ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నామని.. రాబోయే రోజుల్లో కొత్త మోడల్స్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా సీఈవో తెలిపారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంచనా ప్రకారం.. ఈ సీజన్లో భారీగా అమ్మకాలు జరిగాయి. ధనత్రయోదశి రోజున అన్ని కంపెనీలు కలిసి ఒకేరోజు లక్షకుపైగా వాహనాలను డెలివరీ చేశాయి. మార్కెట్‌లో వీటి విలువ రూ.8500 కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

# రూ. 6 లక్షల కోట్లు దాటిన దీపావళి అమ్మకాలు



దేశవ్యాప్తంగా ఈ ఏడాది పండుగ సీజన్‌కు భారీగా రిటైల్ వ్యాపారం జరిగింది. ఒక్క దీపావళి సందర్భంగా దేశంలో రికార్డు స్థాయి రూ. 6.05 లక్షల కోట్ల విలువ అమ్మకాలు జరిగాయని వ్యాపారుల సమాఖ్య కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఏఐటీ) మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ. 5.40 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాల ద్వారా, రూ. 65,000 కోట్లు సేవల ద్వారా వచ్చాయని పేర్కొంది. ఇటీవలి జీఎస్టీ సంస్కరణలు, బలమైన వినియోగదారుల సెంటిమెంట్ కారణంగా ఈ స్థాయి వ్యాపారం చూశామని సీఏఐటీ అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా 60 ప్రధాన పంపిణీ కేంద్రాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా సీఏఐటీ ఈ లెక్కలను వెల్లడించింది. గతేడాది దీపావళి వేళ రూ. 4.25 లక్షల కోట్ల అమ్మకాలు జరిగాయని సీఏఐటీ వెల్లడించింది. మొత్తం విక్రయాల్లో కిరాణా, ఎఫ్ఎంసీజీ 12 శాతం, బంగారం, ఆభరణాలు 10 శాతం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులు 8 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 7 శాతం, రెడీమేడ్ దుస్తులు 7 శాతం, గిఫ్ట్ ఐటమ్స్ 7 శాతం, హోమ్ డెకార్ 5 శాతం, ఫర్నిషింగ్ అండ్ ఫర్నిచర్ 5 శాతం, స్వీట్స్ అండ్ నమ్కీన్ 5 శాతం, టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్స్ 4 శాతం, పూజా వస్తువులు 3 శాతం, పండ్లు, డ్రై ఫ్రూట్స్ 3 శాతం ఉన్నాయి. ప్యాకేజింగ్, హాస్పిటాలిటీ, క్యాబ్ సర్వీసెస్, ట్రావెల్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, టెంట్ అండ్ డెకరేషన్, మ్యాన్‌పవర్, డెలివరీ వంటి రంగాల నుంచి సేవల రంగం అమ్మకాలకు రూ.65,000 కోట్లు వచ్చాయని సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బీ సీ భార్టియా అన్నారు. 72 శాతం మంది వ్యాపారులు రోజువారీ వినియోగ వస్తువులు, పాదరక్షలు, దుస్తులు, మిఠాయి, గృహాలంకరణ, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌పై జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్లే అమ్మకాల రికార్డు స్థాయిలో పెరిగాయని చెప్పారు. సీఏఐటీ ప్రకారం, ఈ ఏడాది దీపావళికి వాణిజ్యం లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, రవాణా, రిటైల్ రంగాల్లో 50 లక్షల తాత్కాలిక ఉద్యోగాల సృష్టి జరిగింది. అలాగే, గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలు మొత్తం వాణిజ్యంలో 28 శాతం వాటా కలిగి ఉండటంతో, ఇవి మెట్రోల కంటే ఎక్కువ ఆర్థిక భాగస్వామ్యాన్ని అందించాయని సీఏఐటీ పేర్కొంది

# రెండు బిగ్ మ్యాచ్‌లపై టీమ్ఇండియా 'గురి'వారం!




గురువారం.. ప్రతి వారంలో వచ్చే రోజే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. ఇది భారత క్రికెట్ అభిమానులకు అత్యంత కీలకమైన రోజు. చావోరేవోలాంటి రెండు మ్యాచులపై గురి పెట్టాల్సిన రోజు. ఎందుకు ఇంత ఉపోద్ఘాతం అంటారా? అయితే, ఆ రెండు మ్యాచులు ఏంటి? ఎందుకు అంత కీలకమో ఓ లుక్కేద్దామా మరి..

ఓడితే సిరీస్‌తోపాటు..

ప్రస్తుతం భారత పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. తొలుత మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగింది. ఇప్పటికే పెర్త్ వేదికగా జరిగిన మొదటి పోరులో టీమ్ఇండియా ఓడింది. ఇక సిరీస్‌ను కోల్పోకుండా సజీవంగా ఉంచుకోవాలంటే రెండో మ్యాచ్‌లో గెలవడం అత్యంత కీలకం. కేవలం సిరీస్ గురించి మాత్రమే కాకుండా.. ఇద్దరు స్టార్ ప్లేయర్ల ఆటతీరుపైనా అభిమానులు, విమర్శకులు దృష్టి సారించే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే తొలి మ్యాచ్‌లో ఆ ఇద్దరు ఘోరంగా విఫలమయ్యారు. ఇక రెండో మ్యాచ్‌లో ఎలా ఆడతారో చూడాలి. ఇంకా అర్థం కాలేదా? ఆ ఇద్దరు ప్లేయర్లు ఎవరో తెలుసా? మన స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన తొలి వన్డే కూడా ఇదే. ఈ మ్యాచ్‌లో విరాట్ డకౌట్ కాగా.. రోహిత్ 8 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. మరోవైపు రెండో వన్డేలో రోహిత్ శర్మను రిప్లేస్ చేస్తారనే వార్తలూ వస్తున్నాయి. యశస్వి జైస్వాల్‌తో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఎక్కువ సమయం మాట్లాడటమే దానికి కారణమంటూ తెలుస్తోంది. అయితే, అతడిని పక్కన పెట్టే అవకాశాలు చాలా తక్కువేనని భారత బ్యాటింగ్ కోచ్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. ఒక్క మ్యాచ్‌తోనే సీనియర్ల ప్రదర్శనను అంచనా వేయడమూ కరెక్ట్ కాదు. అయితే, తుది జట్టులో కుల్‌దీప్ యాదవ్‌కు చోటు కల్పించాలనేవారూ లేకపోలేదు. మరి ఎవరిని తప్పిస్తారనేది ఆసక్తికరమే.

అడిలైడ్ వేదికగా ఉదయం 9 గంటలకు భారత్ - ఆసీస్ మ్యాచ్ ప్రారంభం

స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఓటీటీలో ప్రత్యక్ష ప్రసారం

భారత్ తుది జట్టు (అంచనా): రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, సుందర్/కుల్‌దీప్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్

అసలు ప్రమాదం ఇదే..

మెన్స్ క్రికెట్‌లో రేపటి మ్యాచ్‌ను ఓడినా పెద్ద నష్టమేం ఉండదు. కాకపోతే ఓ సిరీస్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. అదే మహిళల క్రికెట్‌లో మాత్రం 'ట్రోఫీ' దక్కే ఛాన్స్‌ను మిస్ చేసుకున్నట్లే అవుతుంది. ఎందుకంటే సెమీస్‌కు చేరుకోవాలంటే ఇక్కడ్నుంచి మిగిలిన రెండు మ్యాచులూ భారత మహిళా జట్టుకు గెలవడం అత్యంత కీలకం. టాప్ -4లో స్థానం కోసం న్యూజిలాండ్ కూడా ఈ రేసులో ఉంది. గురువారం రోజున కివీస్‌తోనే టీమ్ఇండియా తలపడాల్సి ఉంది. ఇందులో గెలిస్తే పెద్దగా ఇబ్బందుల్లేకుండానే సెమీస్‌కు భారత్ చేరుకుంటుంది. చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించడం పెద్ద కష్టమేం కాదు. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ సెమీస్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం భారత్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), న్యూజిలాండ్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), శ్రీలంక (6 మ్యాచుల్లో 4 పాయింట్లు) నాలుగో బెర్తు కోసం పోటీపడుతున్నాయి. బంగ్లా, పాక్ ఇప్పటికే ఎలిమినేట్ అయిపోయాయి. ఒకవేళ న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా.. భారత్ తన చివరి మ్యాచ్‌లో బంగ్లాను ఓడిస్తే చాలు సెమీస్‌కు చేరుతుంది. మరోవైపు కివీస్ చివరి పోరు ఇంగ్లాండ్‌తో ఉంది. ఆ జట్టును ఓడించడం అంత సులువేం కాదు.

నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా భారత్ - న్యూజిలాండ్ మ్యాచ్

మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం

స్టార్‌స్పోర్ట్స్ ఛానళ్లు, హాట్‌స్టార్ ఓటీటీల్లో ప్రత్యక్ష ప్రసారం

భారత తుది జట్టు (అంచనా): ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్

# స్పోర్ట్స్

## చిత్తుగా ఓడిన ఆఫ్ఘనిస్తాన్.. జింబాబ్వే చారిత్రక విజయం




స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తుగా ఓడించింది. 12 ఏళ్ల తర్వాత జింబాబ్వే గెలిచిన తొలి టెస్ట్ మ్యాచ్ ఇది. మూడు రోజుల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే అన్ని విభాగాల్లో సత్తా చాటింది. బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌ల్లో ఆఫ్ఘనిస్తాన్ కనీసం 200 స్కోర్ కూడా చేయనివ్వలేదు. బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసి సత్తా చాటారు. ఓపెనర్ బెన్ కర్రన్ కెరీర్‌లో తొలి సెంచరీతో కదంతొక్కాడు. సికందర్ రజా అర్ధ సెంచరీతో రాణించాడు. నిక? వెల్చ్ 49 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. పేసర్ బ్రాడ్ ఈవాన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి ఆఫ్ఘనిస్తాన్ పతనాన్ని శాశించాడు. ముజరబానీ 3 వికెట్లతో రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో రిచర్డ్ నగరవ 5 వికెట్లతో చెలరేగాడు. ముజరబానీ ఈ ఇన్నింగ్స్‌లోనూ రాణించి 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకే ఒక సానుకూల అంశం ఉంది. పేసర్ జియా ఉర్ రెహ్మాన్ 7 వికెట్లతో చెలరేగాడు. ఆఫ్ఘన్ స్టార్ బ్యాటర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (37, 9) ఇబ్రహీం జద్రాన్ (19, 42) పెద్దగా రాణించలేకపోయారు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో గుర్బాజ్, రెండో ఇన్నింగ్స్‌లో జద్రానే టాప్ స్కోరర్లు కావడం విశేషం. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (7, 7) రెండు ఇన్నింగ్స్‌ల్లో నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో బషీర్ షా (32) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఇన్నింగ్స? పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేసిన జింబాబ్వే ఆటగాడు బెన్ కర్రన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.


స్కోర్ వివరాలు..

జింబాబ్వే-359

ఆఫ్ఘనిస్తాన్-127 %ు 159

కాగా, ఏకైక టెస్ట్ మ్యాచ్, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం? ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేలో పర్యటిస్తుంది. టెస్ట్ మ్యాచ్ అనంతరం హరారే వేదికగా మూడు టీ20లు (అక్టోబర్ 29, 21, నవంబర్ 2) జరుగనున్నాయి.

## లెఫ్టినంట్ కల్నల్‌గా నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భారతీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతంలో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న , అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు.

# 'నాగబంధం' విడుదల ఎప్పుడంటే...!



అభిషేక్ నామా నాగబంధం-ది సీక్రెట్ ట్రెజర్ అనే పాన్-ఇండియా పౌరాణిక సాహసం ప్రాజెక్ట్ ని ప్రకటించారు. విరాట్ కర్నా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం పురాతన ఇతిహాసాలు మరియు ఆధ్యాత్మిక రహస్యాలలో పాతుకుపోయిన గ్రిప్పింగ్ ప్రయాణంలో ప్రేక్షకులను తీసుకుంటుంది. తాజాగా ఇప్పుడు లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం, ఈ సినిమాని మార్చి 19న ఉగాది సందర్భంగా విడుదల చేయటానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. నభా నటేష్ మరియు ఈశ్వర్య మీనన్ ఈ సినిమాలో మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, మరియు దీ.వా. అవినాష్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ సహకారంతో నిక్ స్టూడియో కింద కిషోర్ అన్నపు రెడ్డి ఈ చిత్రాన్ని గొప్ప స్థాయిలో నిర్మించారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, అభే సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్, సంతోష్ కామిరెడ్డి ఎడిటింగ్. అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ మరియు మలయాళంలో ఏకకాలంలో విడుదలకు సిద్ధంగా ఉంది.



# 'కే-ర్యాంప్' బ్లాక్ బస్టర్ టూర్ వివరాలు

జైన్స్ నాని దర్శకత్వంలో టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బావరం ప్రధాన పాత్రలో నటించిన 'కె-ర్యాంప్' అక్టోబర్ 18న గ్రాండ్ దీపావళి సందర్భంగా విడుదల అయ్యింది. ఈ సినిమా విడుదలైన అన్ని చోట్ల మిక్స్ రివ్యూస్ ని అందుకుంటుంది. తాజాగా ఇప్పుడు మూవీ మేకర్స్, ఈ రోమ్-కామ్ ఎంటర్టైనర్ యొక్క బ్లాక్ బస్టర్ టూర్ వివరాలని వెల్లడించారు. అక్టోబర్ 22న నెల్లూరు మరియు కడపలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రంలో యుక్తి థారెజా మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాయి కుమార్, నరేష్ విజయకృష్ణ, కమ్నా జెత్మమానీ, మురళీధర్ గౌడ్, వెన్నెలా కిషోర్, సీత మరియు ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి సంగీతాన్ని చైతన్ భర్ద్వాజ్ స్వరపరిచారు. హస్యా సినిమాలు మరియు రుద్రాన్ష్ సెల్యులాయిడ్ కింద రాజేష్ దండా మరియు శివ బొమ్మక్కు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# సంక్రాంతికి వినోదాల విందు

తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హీరో నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు.తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉండటం విశేషం.రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని 'ఒక నవ్వుల అల్లరి', 'వినోదాల విందు', 'అసలైన పండుగ సినిమా' అని పిలుస్తున్నారు.హాస్యం తాజాదనంతో ఉండి ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో ఆ అంచనాలను రెట్టింపు చేసి, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లలో ఒకటిగా ఈ చిత్రాన్ని నిలిపింది.





# 'ఆ సినిమాతో తీవ్ర నిరాశ.. అంగీకరించక తప్పదు'

అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం బైసన్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్రమ్ తనయుడు ధ్రువ్ హీరోగా వస్తోన్న బైసన్ మూవీ తెలుగులోనూ రిలీజవుతోంది. ఇప్పటికే కోలీవుడ్‌లో విడుదలైన ఈ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం బైసన్ మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉంది ముద్దుగుమ్మ. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన తన మూవీ పరదా గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తెలుగులో తాను నటించిన పరదా మూవీ బాక్సాఫీస్ రిజల్ట్ తనను తీవ్రంగా నిరాశపర్చిందని తెలిపింది. ఇలాంటి ఫలితం తాను ఊహించలేదని వెల్లడించింది. పరదా మూవీ రెస్పాన్స్ చూసి చాలా బాధపడ్డానని పేర్కొంది. ఈ ఏడాది తాను నటించిన ప్రాజెక్టులు ఆశించిన విజయాన్ని సాధించలేదన్నారు. ఈ విషయాన్ని అంగీకరించక తప్పడం లేదని వివరించింది. ఆగస్టులో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. అనుపమ మాట్లాడుతూ..'మనం చేసే ప్రతి చిత్రానికి అది బాగానే వస్తుందని అనుకుంటాం. ప్రేక్షకులందరూ మన సినిమా ఇష్టపడతారని ఆశిస్తున్నాం. అది తప్పనిసరిగా బాక్సాఫీస్ వద్ద హిట్ కాకపోయినా.. నేను ప్రతి చిత్రంలో విభిన్న పాత్రలను పోషించడానికి ప్రయత్నిస్తున్నా. కిష్కింధపురి పాత్ర.. బైసన్ రోల్ ఒకటి కాదు. ఏదైనా నా సినిమా విజయం సాధించినప్పుడు.. మంచి సినిమాలు చేయడానికి.. స్క్రిప్ట్‌లను తెలివిగా ఎంచుకోవడానికి తోడ్పడుతుంది' అని పంచుకుంది. కాగా.. రూ. 15 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన పరదా ప్రపంచవ్యాప్తంగా కేవలం రూ. 1.2 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన పరదా ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఆగస్టు 22న థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ అమెజాన్ ప్రైమ్‌లో అందుబాటులో ఉంది. బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేని ఈ సినిమాకు..ఓటీటీలో అద్భుతమైన రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో సంగీత, దర్శనా రాజేంద్రన్, రాగ్ మయూర్, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీని విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించారు. చాలా కాలంగా ఉన్న ఆచారంలో భాగంగా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి ఓ గ్రామానికి చెందిన యువతి కథగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.



# లోక తెలుగులో తీస్తే డిజాస్టర్!

మలయాళంలో బాక్సాఫీస్ రికార్డులన్నీ కొల్లగొడుతూ రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం రేపింది లోక-చాప్టర్ 1 సినిమా. ఇది లేడీ ఓరియెంటెడ్ మూవీ కావడం విశేషం. సౌత్ ఇండియాలో వచ్చిన ఫస్ట్ లేడీ ఓరియెంటెడ్ సూపర్ హీరో మూవీ ఇది. ఈ చిత్రాన్ని తెలుగులో కొత్త లోక-చాప్టర్ 1 పేరుతో రిలీజ్ చేసి మంచి ఫలితాన్నందుకున్నాడు ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఐతే మలయాళం మూవీ కాబట్టి ఈ సినిమాను ఆదరించారు కానీ.. నేరుగా తెలుగులో తీసి రిలీజ్ చేసి ఉంటే అది డిజాస్టర్ అయ్యేది అంటున్నాడు నాగవంశీ. తన బేనర్ నుంచి రాబోతున్న కొత్త చిత్రం మాస్ జాతర ప్రమోషన్లలో భాగంగా నాగవంశీ.. హీరో రవితేజతో కలిసి ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ ఇంటర్వ్యూ చేసింది మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల దర్శకుడు కళ్యాణ్ శంకర్ కావడం విశేషం. ఈ ముగ్గురూ కలిసి తెలుగు ప్రేక్షకుల సినీ అభిరుచి గురించి.. సోషల్ మీడియాలో సినిమా చర్చలు పెట్టే వాళ్ల గురించి మాట్లాడారు. ఈ క్రమంలోనే నాగవంశీ.. లోక మూవీ గురించి మాట్లాడాడు. ఆ సినిమాను తెలుగులో తీస్తే లాజిక్కుల గురించి మాట్లాడి, ఇదేం సినిమా అని ఫ్లాప్ చేసేవాళ్లని అన్నాడు. మన ఆడియన్స్ ఎప్పుడు ఏ సినిమాను ఆదరిస్తారో చెప్పలేమని అతనన్నాడు. లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో హీరో హీరోయిన్లు, దర్శకుడు ఎవరో తెలియదని.. అయినా దానికి ప్రిమియర్స్ వేస్తే అడ్వాన్స్ బుకింగ్స్ గట్టిగా జరిగాయని.. సినిమా ఎవ్వరూ ఊహించనంత పెద్ద హిట్ అయిందని నాగవంశీ అన్నాడు. సంక్రాంతి, దసరా, దీపావళి లాంటి పండుగలకు మాస్ సినిమాలు తీస్తే ఆహా ఓహో అంటారని.. మిగతా టైంలో మాస్ సినిమాలు వస్తే రొటీన్ అని ముద్ర వేసేస్తారని, నాగవంశీతో పాటు రవితేజ కూడా కామెంట్ చేశాడు. కరోనా తర్వాత ఓటీటీలో సినిమాలు చూసేవాళ్లు పెరిగిపోయారని.. వాళ్లు థియేటర్లకు వచ్చి సినిమాలు చూడరని.. కానీ మాస్ సినిమాల గురించి మాత్రం తేలిగ్గా కామెంట్ చేస్తారని రవితేజ అన్నాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com